## రోడ్ల విస్తరణకు
# నిధులు కేటాయించండి

■ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినతి..
■ ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వండి

16






# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 22 ఆగస్టు 2025 | ■ 16 పేజీలు




13

# మట్టి గణపయ్యనే పూజిద్దాం

## మట్టి గణపతి మనస్మరామి

■ ప్రభాత సమాచారం, ముధోల్

### పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ■ మహాశ్రేష్ఠం మట్టి గణపతి ■ మట్టి విగ్రహాలవైపే మొగ్గు..
- ■ మట్టి ప్రతిమలే మేలంటున్న పర్యావరణ వేత్తలు
- ■ తయారీతో ఉపాధి పొందుతున్న యువకులు
- ■ వినాయక చవితికి ముస్తాబవుతున్న గణపయ్యలు
- ■ ప్రజల అభిరుచికి తగ్గట్టు బొజ్జ గణపయ్యల తయారీ
- ■ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతి యేటా జరుపుకొంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గణనాథుడి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతారు. రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందని, దీంతో పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుంది. ఉమ్మడి జిల్లాలో చవితి సందడి నెలకొంది. 27 నుంచి ప్రారంభమయ్యే నవరాత్రులను పురస్కరించుకొని మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి. మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు, యువత నిమగ్నమయ్యారు. ప్రతిష్ఠకు గణనాథులను తరలిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలు, రంగులతో తయారు చేసిన ప్రతిమల కంటే మట్టి వినాయకులే శ్రేష్ఠమని వేద పండితులు, పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.




16

## చెన్నూరు ఎస్‌బిఐలో
# కుంభకోణం

- ■ బ్రాంచి 2-లో వెలుగు చూసిన ఘటన
- ■ రూ.80 లక్షల నగదు, రూ.5 కోట్ల వరకు గోల్డ్ మాయం
- ■ గుర్తించిన బ్యాంకు సబ్బంది.. పోలీసులకు ఫిర్యాదు
- ■ పరారీలో బ్యాంకు క్యాషియర్ ■ ఆచూకీ కోసం గాలింపు
- ■ నిందితులను త్వరలోనే పట్టుకుంటాం
- ■ బ్యాంకును పరిశీలించిన రామగుండం సీపీ

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్-2లో పెద్ద ఎత్తున నగదు, బంగారం మాయమైంది. ఈ విషయాన్ని బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ నిమిత్తం బ్యాంకును అధీనంలోకి తీసుకున్నారు. రూ.80లక్షల నగదుతో పాటు ఐదు కోట్ల రూపాయల విలువైన బంగారం మిస్ అయినట్లు బ్యాంకు మేనేజర్ ఆడిట్‌లో గుర్తించారు.



11

# కాడెద్దుల పండుగ.. కనుల విందుగ

- ■ బసవన్నకు రైతుకు మధ్య అనుబంధానికి ప్రతీక పొలాల పండుగ ■ ఎడ్లను అలంకరిస్తున్న రైతులు
- ■ గ్రామాల్లో ప్రత్యేక పూజలు ■ వారసంతలో పొలాల అమావాస్య సందడి ■ నేడు పొలాల అమావాస్య..
- ■ 23న తాంసిలో అధికారికంగా పొలాల పండుగ ■ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ప్రస్తుతం వ్యవసాయ రంగం నూతన సాంకేతికతతో కొత్తపుంతలు తొక్కుతోంది. ఎన్నో ఆధునాతన మార్పులతో దూసుకుపోతోంది. ఎన్ని మార్పులొచ్చినప్పటికీ దుక్కిదున్నటంలో అన్నదాతకు ఆది నుంచి నేటి వరకూ అండగా నిలుస్తున్నవి బసవన్నలే. వేల సంవత్సరాలుగా రైతుకి ఎద్దుకి ఉన్న అనుబంధం విడదీయనిది. అందుకే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా బసవన్నల కోసం ఏకంగా ఓ పండుగనే చేస్తారు. అదే పొలాల పండగ.

## అదిగో పులి.. ఇదిగో చిరుత

6లో

- ■ కలకలం సృష్టిస్తోన్న పెద్దపులి, చిరుతలు
- ■ భయాందోళనల్లో ప్రజలు ■ దేవాపూర్‌లో పెద్దపులి అలజడి
- ■ దాడిలో రెండు ఆవులు, లేగ దూడ మృతి



## క్షీణిస్తున్న 'పాల్వాయి' ఆరోగ్యం




## ఉత్సవాలు శాంతియుతంగా
# జరుపుకోవాలి

■ శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా

గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, సమన్వయంతో నిర్వహించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో కలిసి శాంతి కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్-ఉన్-నబి వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్నారు.

వివరాలు 4లో





# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పకడ్బందీ చర్యలు

- విద్యారంగ అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు
- ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి
- పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందించాలి
- నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం బాబా నగర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, వసతి గృహం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, త్రాగునీరు, తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, తరగతిలో వెనుకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గడ్పూర్ గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి మందుల నిల్వ లు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు మెరు గైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వైద్యులు, సిబ్బంది వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇం దిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే ఇల్లు నిర్మిం చుకునేలా వారికి అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. చిన్న గోపాలపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యాబోధనతో పాటు విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ర్యాలీ గ్రామంలోని ఎస్.సి. కాలనీలో జ్వరం బారిన పడిన 10 మంది నివాసం ప్రాంతాలను హౌసింగ్ పి.డి. బన్సీలాల్‌తో కలిసి పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# హరితహారం ఆరంభ శూరత్వమేనా!



## నర్సీలో మొక్కలను గాలికి వదిలలేశారు

**కుభీర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం ఆచరనలో అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు చోటు చేసుకున్నాయి. ప్రతినిత్యం మండల స్థాయి అధికారులు ఈ దారిలోనే వెళ్తూ వస్తూ ఉంటారు. ఈ మార్గంలోనే నర్సరీ పరిస్థితి ఈ విధంగా ఉంటే మారుమూలనున్న గ్రామపంచాయతీలోని నర్సరీల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని చోండి గ్రామ పంచాయతీ మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. కొన్నిరోజుల క్రింద నర్సరీలో పెరిగిన మొక్కలను తొలగించడంతో మొక్కలు లేని ఖాళీ ప్యాకెట్ల బాగోతం ఇట్టే బయటపడింది. వేలల్లో ప్యాకెట్లు పదుల్లో మొక్కలు అన్నట్లుగా ఖాళీ పాకెట్లు కనిపిస్తున్నాయి. పంచాయతీకి సెక్రెటరీ, పర్యవేక్షణకు అధికారి, ఉపాధి హామీ పనుల నిర్వహణకు సిబ్బంది ఉన్నారు. సిబ్బంది దండిగా ఉన్న ఇక్కడి నర్సరీలో మాత్రం పనుల పరిశీలన మాత్రం అంతంత మాత్రంగానే జరిగిందని, ఖాళీ ప్లాస్టిక్ కవర్లను చూస్తే అర్థమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. కవర్లో విత్తనం పెట్టి మొక్క పెరిగిందా లేదా చూడాల్సింది పోయి పట్టించుకోలేదు. పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యం మరో కారణం. నర్సరీ పెంపకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మండల పంచాయతీ అధికారి మోహన్ సింగ్ వివరణ కోరగా ఈ పనులు పర్యవేక్షించేది ఉపాధి హామీ సిబ్బంది అన్నారు.



## తల్లికి దూరమైన పసికందు

### చికిత్సపొందుతూ ఆత్రం దేవ్ బాయి మృతి

**వాంకిడి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** మండలంలో చౌపన్‌తగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గోధాపూర్ గ్రామానికి చెందిన బాలింత మహిళ ఆత్రం దేవ్ బాయి గురువారం మృతి చెందింది. ఆగస్టు 14న పురిటి నొప్పులతో బాధపడుతుండగా సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామానికి అంబులెన్స్ రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను బైక్‌పై కూర్చొపెట్టి కర్రతేలి, గుంతలు, ఎత్తు పల్లాలు గల రోడ్డు పై మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి అతికష్టం మీద ఆమెను అంబులెన్స్ ఆగిఉన్న దొడ్డిగూడ గ్రామం వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్సులో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసవం అనంతరం బిడ్డ క్షేమంగా ఉన్నా దేవ్‌బాయి రక్తహీనతతో బాధపడుతుండగా ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వారం నుంచి గాంధీ ఆసుపత్రిలో వెంటిలెటర్‌పై చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమిం చడంతో గురువారం ఉదయం మృతి చెందింది. దీంతో ఊహతెలియని పసికందుకు తల్లి ప్రేమ లేకుండాపోయింది.



## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా యంలోని కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి కలిసి మొక్కను అందజేశారు.



### బెల్లంపల్లి ఎమ్మెల్యే

## అనుచరుల హల్ చల్

- రోడ్డుపై చిందులు
- వాట్సాప్ గ్రూపుల్లో వైరల్

**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అనుచరగణం మద్యం తాగి రోడ్డుపై వేసిన చిందులు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో సాక్షాత్తు ఎమ్మెల్యే పిఏ రామకృష్ణతో పాటు ప్రధాన అనుచరులు ఉండటం గమనార్హం. రోడ్డుపై వేసిన చిందులు బెల్లంపల్లిలో వాట్సాప్ గ్రూపులో వైరల్‌గా మారాయి. ఈ వీడియో దృశ్యాలను వాట్సాప్ గ్రూపులో చూసిన ప్రతి ఒక్కరు నవ్వుకోవడం కనిపించింది. మరికొందరు ఇదేమీ విడ్డూరమని అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానికంగా పర్యటించారు. ఆ క్రమంలోనే ఈ సంఘటన చోటు చేసుకుంది. విందులు అరగించి జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై రాత్రి ఎమ్మెల్యే అనుచర బృందం నృత్యాలు ఆలస్యంగా వెలుగు చూశాయి. సిగ్గు ఎగ్గు వదిలి ఎంత బరితెగింపుకి దిగజారడంపై వాడి వేడిగా చర్చ జరుగుతున్నది. అనుచరుల వ్యవహారంతో ఎమ్మెల్యే పరువును మరోసారి గంగపాలు అయినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.



## నో డీజేలు.. 2 బాక్సులకే అనుమతి

**మామడ, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండప నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని రెండు బాక్సులు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జన సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డీజేల, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్లు పెంచకపోతే సహించేది లేదు

- పింఛన్లు పెంచు తాడో, దిగిపోతాడో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చుకోవాలి
- పింఛన్ల పెరుగుదలపై సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో యుద్ధ భేరి సభ
- ప్రతిపక్ష హోదా నుంచి కేసీఆర్ తప్పుకోవాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)
దివ్యాంగులకు అందించే పింఛన్లు పెంచుతూ ప్రభుత్వ ప్రకటన చేయకుంటే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ అన్నారు. మహాగర్జన సభ నియోజకవర్గ స్థాయి సన్నాహక సదస్సును గురువారం బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచు తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చకపోవడంతో రాష్ట్రంలో 50లక్షల మందికిపైకి పింఛన్‌దారులు ఎదురు చూస్తున్నారన్నారు. పింఛన్లు పెంచకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామన్నారు. ప్రజలకు హామీ ఇచ్చి అధికార పగ్గాలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి నేటికి 20 నెలలు దాటిన ఫించన్ల పెంపుపై నోరు మెదపకపోవడం అమానుషమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు రామగిరి మహేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి కళావేదికలో నిర్వహించిన ఫించన్ దారుల సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫించన్ల పెంచడంపై మాటతప్పిన రేవంత్ రెడ్డిని గద్దె దింపేందుకు సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో వికలాంగుల, వితంతువుల, ఒంటరి మహిళల, వృద్ధులతో యుద్ధ భేరి సభను నిర్వహిస్తున్నట్లు మందకృష్ణ చెప్పారు. ఎన్నికల లకు ముందు ఫించన్లు పెంచుతామని ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఓడగొట్టి ప్రతిపక్షానికి పరిమితం చేశారని అన్నారు. పింఛన్ల పెంపు విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు నోరు విప్పడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారం



లోకి వచ్చిన వెంటనే ఫించన్లు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి 20 నెలలు గా ఫించన్లు పెంచకుండా 20 వేల కోట్ల రూపాయల పింఛన్ల డబ్బును భూమి ఉన్న రైతాంగానికి ఇచ్చి ఫించన్ తో జీవనం సాగించే నిరుపేదలను మోసం చేశారని మంద కృష్ణ ఆరోపించారు.అసెంబ్లీకి వచ్చి అడుగ దు,బయటికి వచ్చి పోరాడడు ఫాంహౌస్ కేసీఆర్ పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. పింఛన్ల భారీ సభలో రేవంత్ పదవి నుంచి తప్పు కుంటాడో, ఫించన్లు పెంచుతాడో తేలిపోతుందని విమర్శించారు. ఆదినుంచి ఫించన్‌ల పెరుగుదల కోసం పాలకుల పై పోరాడింది ఎమ్మార్పీఎస్ మాత్రమేనని ప్రకటించారు. నేడు కూడా ఫించన్లు పెంచుకునేందుకు హైదరాబాద్‌లోని సభ దోహదపడుతుందని ఈ సభకు భారీ సంఖ్యలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తరలిరావాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 33 జిల్లా ల్లో,అనేక అసెంబ్లీ నియోజక వర్గాల్లో సన్నాహక సభల్లో తాను పాల్గొని ఫించన్ దారులను సన్నద్ధం చేస్తున్నట్లు మందకృష్ణ స్పష్టం చేశారు. పింఛన్ల పెరుగు దల పై పాలక ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరి మార్చుకోవాలని మందకృష్ణ హితవు పలికారు. అనంతరం మందక్రిష్ణను పలువురు సన్మానించారు. సమావేశానికి ఏడీప సురేశ, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు దాసారపు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, పెద్ద సంఖ్యలో వికలాంగులు, ఫించన్ దారులు హాజరయ్యారు.



# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

■ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి ■ ఉట్నూర్ ఐటిడిఎ పీఓ ఖుష్బు గుప్తా



జన్నారం, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)
ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన మెరుగైన విద్య అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. గురువారం జన్నారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలు, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుం టుందన్నారు.

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజు నోటీసు..**

విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్ కు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధుల పట్ల సమయపాలన పాటించని ఎస్.జి.టి. ఉపాధ్యాయునికి సైతం షోకాజ్ నోటీసు ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలి పారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఐటిడిఏ పిఓ సూచించారు. ప్రతి రోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగు దొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఔషధాలను, రిజిస్టర్ లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు

# వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పశువులపై దాడి చేసి హతమార్చిన పులి

ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)
కొమురం భీం ఆసిఫాబాద్ - మంచిర్యాలలోని సరిహద్దు గ్రామంలో పులి కలకలం రేపింది. బుధవారం రాత్రి దొండ్ల గ్రామ శివారులోని దేవాపూర్ అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసింది. తిర్యాణీ మండలంలోని ఏదులపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని దొండ్ల గ్రామంలోని తుమ్రం మల్కు, నైతం శేఖర్, తుంరం భీములకు చెందిన పశువులపై పులి పంజా విసిరింది. ఇక పులి దాడి మృతి చెందిన పశువులకు అటవీ శాఖ అధికారులు సంచనామా నిర్వహించి, నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అటు ఈ ఘటన తమ పరిధిలోకి రాదని.. అధికారులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించినట్లు రైతులు తెలుపుతున్నారు. అయితే అటవీ శాఖ అధికారులు మాత్రం ఇంకా పులి దాడిలో పశువులు మృతి చెందినట్లు నిర్ధారణ చేయలేదు. ఓవైపు పులిదాడిలో పశువులు మృత్యువాత



పడుతుంటే సంబంధిత అటవీశాఖ అధికారులు మాత్రం ఇది తమ పరిధిలోకి రాదని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పశువులు పులి దాడిలోనే మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

# కలప స్వాధీనం, కేసు నమోదు

కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)
కాగజ్‌నగర్ పట్టణంలోని పెద్దవాగు సమీపంలో అక్రమంగా నిర్గమించిన కలపను స్వాధీన పరుచుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఓ సామిల్లు యజమాని ఆ కలపను నిల్వ ఉంచినట్లు తెలిపారు. కలపను స్వాధీన పరుచుకుని, సామిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. ఆ కలప విలువ దాదాపు రూ.55 వేల వరకు ఉంటుందన్నారు.





# ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- మండపాల వద్ద జిల్లాలో డీజేకు అనుమతి లేదు
- మండపాల నిర్వాహకులు సహకరించాలి
- మత పెద్దలతో శాంతి సమావేశం..
- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో పాటు అధికారులు వివిధ అంశాలపై సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు శాంతియుతంగా, సామరస్యంతో ఉత్సవాలను నిర్వహించాలనీ, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి హిందూ సమాజ సమితి ఉత్సవ కమిటీ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామని అన్నారు. రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ తీగలు, కేబుల్స్ సవరణ వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత 50 సంవత్సరాల నుండి శాంతియుత వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. గతేడాది తరహాలోనే ఈసారి కూడా వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుక వెంటవెంటనే వస్తున్నాయని భద్రతాపరమైన చర్యలకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాల వివరాలను తెలియజేయాలని, టీమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మండపాలు ప్రతిష్ఠించాలని సూచించారు. మండపాల వద్ద డీ.జే సౌండ్లను నిషేధించడం జరిగిందని, మండపాల వద్ద భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి...**

మండపాల వద్ద రాత్రి సమయంలోనూ నిర్వాహకులు తప్పనిసరిగా బస చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్ల ను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడ్స్, ట్రాఫిక్ క్రమబద్దీకరణ, టాయిలెట్స్, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

చెరువులు, పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు సందర్భంగా మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండపాల్లో సానిటేషన్ జరగాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలలో చేసే పోస్టింగ్ ల పై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సబ్ కలెక్టర్ యువరాజ్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డిఎస్పీ జీవన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమ శ్రీ, మున్సిపల్ కమీషనర్ సివిఎన్ రాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చవాన్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు హన్మండ్లు, రాళ్ళబండి మహేందర్, వివిధ పార్టీల నాయకులు, మత పెద్దలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**వాంకిడి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండలం జైత్‌పూర్ బోర్డ గ్రామంలో సుమారుగా 10 మంది రైతులకు చెందిన 30 ఎకరాల పంట నష్టం అడా ప్రాజెక్టు నీటి ప్రవాహంతో జరిగింది. నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు 7 గేట్లు ఎత్తడంతో వాగు ద్వారా పత్తి చేనులోకి నీరు చేయడంతో పంట మొత్తం నీట మునగడంతో రైతులకి నష్టం జరిగింది. ఆ పంట నష్టానికి సుమారుగా ఎకరాకి 50 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వ్యవసాయ అధికారులు పంపించి నీట మునిగిన పంటచేళ్లను పరిశీలించి నష్టపోయిన వారికి పరిహారం అందించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, గెడం టీకానంద్, సిపిఎం నాయకులు వడ్డూరి మల్లేష్, గ్రామ రైతులు జబోరే తిరుపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేలాల స్టాక్ యార్డ్ నుండి ఇసుక తరలించేందుకు అనుమతి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని జైపూర్ మండలం వేలాల స్టాక్ యార్డ్ లో ఉన్న ఇసుకను టి.జి.ఎం.డి.సి. సాండ్ బజార్ కు తరలించేందుకు అనుమతి మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేలాల స్టాక్ యార్డులో ఉన్న 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను టి.జి.ఎం.డి.సి. సాండ్ బజార్‌కు కేటాయించడం కొరకు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మండలాలలో ఇసుక బజార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, నిరంతర వర్షపాతం కారణంగా జిల్లాలో ఇసుక సేకరణలో అంతరాయం ఏర్పడిందని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ముఖ్య



ఇసుక అవసరం ఉన్నందున జిల్లాకు పంపిన ప్రతిపాదన మేరకు, నీటిపారుదల శాఖ, టి.జి.ఎం.డి.సి. జిల్లా రికార్డుల ప్రకారం, ప్రస్తుతం వేలాల స్టాక్‌యార్డ్‌లో అందుబాటులో ఉన్న సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను కేటాయించి రవాణా చేయడానికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సర్పంచుల సంఘం చేయూత



**నార్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ గురువారం నార్నూర్ మండలంలోని గంగాపూర్ ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు, కుర్చీలు విరాళంగా అందజేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించి లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాసే సామగ్రిని కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ దిగంబర్, రెడ్డి నాయక్, గంగాసింగ్, అనిత తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

## నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

**నిర్మల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం నిర్మల్ రూరల్ మండలం చిట్యాలలోని అభయ కృషి ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా, డీఏపీ సహా అవసరమైన ఎరువులు సరిపడా స్టాక్‌లో ఉన్నాయని వెల్లడించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు. ప్రతి షాపులో ఎరువుల రేటు చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఎరువుల సరఫరాలో ఎటు వంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మండపాల్లో భక్తి పాటలే ఏర్పాటు చేసుకోవాలి

## భైంసా రూరల్ సీఐ నైలు నాయక్



**కుభీర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
గణేష్ మండపాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని భైంసా రూరల్ సీఐ నైలు నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రం కుభీర్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిర్వాహక కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పంచాయతీ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ నుంచి ఎన్‌వోసీలు జత చేయాలన్నారు. అనుమతులు పొందిన తరువాతనే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద పేకాటకు పాల్పడితే డయల్ 100 సమాచారం ఇవ్వాలని, మండపాల వద్ద రాత్రి పూట నిర్వహణ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలని, సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మండపాల్లో సాంప్రదాయ భక్తి కార్యక్రమాలు, భక్తి పాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపులో అనుచిత, అశ్లీల నృత్యాలు, అశ్లీల పాటలు, లౌడ్ స్పీకర్లు వంటివి నిషిద్ధమన్నారు. అనుమతి లేకుండా మందుగుండు, డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊరేగింపులో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఉపన్యాసాలు చేయడం తగదన్నారు. వినాయకుడి విగ్రహాలను నెలకొల్పి ప్రజల్లో భక్తి భావన పెంపొందించేలా మండపం నిర్వాహకులు మసలు కోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఏశాల దత్తాత్రి, బందెల శంకర్, బోయిడి అభిషేక్, బి శేఖర్, బ్యారపు కానోబా, నారాయణ, మడి ప్రవీణ్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## సద్గురు పులాజీ బాబా జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

**జైనూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
శ్రీశ్రీశ్రీ సద్గురు పులాజీ బాబా జన్మదిన మహోత్సవ పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో సంస్థాన అధ్యక్షులు కేశవ్ ఇంగ్లే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్నాపూర్‌లోని సిద్దేశ్వర సంస్థాన్ మఠంలో ఈనెల 30న నిర్వహించే జన్మదిన వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనుషులకు మానవత్వాన్ని నేర్పించిన మహావ్యక్తి శ్రీ సద్గురు పులాజీ బాబా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి సుభాష్ దుక్రే, నాయకులు ఆత్రం రాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, సహకార సంఘం చైర్మన్ కోడప హన్ను పటేల్, మేశ్రం అంబాజీరావు, దౌలత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన మోర్లె పల్లవి అనే మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం ఉదయం పల్లవికి పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మంచిర్యాల సిబ్బంది ఈఎంటీ సత్యనారయణ గర్భిణిని మంచిర్యాల మాతా శిశు హాస్పిటల్‌కి తీసుకవస్తుండగా పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో వెంటనే ఈ విషయాన్ని వైద్యాధికారులకు సమాచారం అందించి వారి సూచనల మేరకు 108లోనే ప్రసవం జరిపించగా రెండవ కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఎంసీహెచ్ హాస్పిటల్‌కు తరలించి వైద్యచికిత్సను అందిస్తున్నారు. అత్యవసర సమయంలో అప్రమత్తంగా వ్యవహరించిన 108 సిబ్బంది ఈఎంటీ సత్యనారయణ, పైలెట్ వెంకటేశ్వర రావులను 108 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అభినందించారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు

**సిరికొండ, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సిరికొండ మండలం రాజుల్ గూడకు చెందిన పేందుర్ యాదోరావ్ ఇల్లు భారీ వర్షాల కారణంగా కుప్పకూలింది. ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. వర్షాలవల్ల గోడలు జారిపోయి ఇల్లు కూలిపో యిందని యాదోరావ్ తెలిపారు. వర్షాల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నార్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం భీంపూర్ తండా,నాగల్ కొండ గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. అవసరం ఉన్నవారికి రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో నీళ్ల విరోచనాలు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా శుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. వైద్య శిబిరంలో ఆరోగ్య విస్తరణ అధికారి తులసీదాస్, ఆరోగ్య పర్యవేక్షకులు చరణ్, వైద్యసిబ్బంది శ్యామ్, జవ హార్‌లాల్, గోకుల్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## గణేష్ నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలి

**తాండూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
గణేష్ నవరాత్రులు శాంతియుతంగా జరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య తెలిపారు. తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ప్రారంభ నేపథ్యంలో ముందస్తుగా ముస్లిం సోదరులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కుల, మత భేదం లేకుండా సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపట్టే తనిఖీలకు సహకరించాలన్నారు. మండపాల నిర్వహణకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ జాన్, నాయకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





## పింఛన్లను పెంచి ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి

**కుభీర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
అధికారంలోకి వస్తే పింఛన్లను పెంచి ఇస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాజ్ కుమార్, నందు డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం జుమ్డ గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నా బహు సాఠె 105వ జయంతి సందర్భంగా గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో దివ్యాంగులతో పాటు వృద్ధులకు, బీడీ కార్మికులకు పింఛన్ డబ్బులు పెంచి అందిస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం బైంసాలో ఏర్పాటుచేసిన మహా గర్జనకు పింఛన్లు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సాఠే చిత్రపటానికి గ్రామ అధ్యక్షుడు నందు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెండాను ఆవిష్కరించి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. సాఠే అడుగుజాడల్లో నడుచుకుంటూ సమాజానికి ఉపయోగపడేలా ముందుకు సాగుదామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, సాయిచంద్, జీవన్, సురేష్, గీత్ కుమార్, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన అల్లోల

**నిర్మల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని వివిధ కుటుంబాలను మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గురువారం పరామర్శించారు. బీసీ సంఘ నాయకులు ఆరుమూల భాస్కర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్ తో పాటు మరో 10 కుటుంబాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ప్రదీప్ కుమార్ రమణారెడ్డి శ్రీకాంత్ యాదవ్ తదితరులున్నారు.



## దేవాపూర్ అడవుల్లో పెద్దపులి అలజడి



దాడిలో రెండు ఆవులు, లేగ దూడ మృతి

**కాసిపేట, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోంపల్లి అటవీ ప్రాంతంలో ఆవులపై పెద్ద పులి దాడి చేసి రెండు ఆవులను, లేగ దూడను హత మార్చింది. దేవాపూర్ రేంజర్ అనిత తెలిపిన వివరాల ప్రకారం.. రోంపల్లి అటవీ పరిధిలోకి వెళ్లిన ఆవులపై పెద్ద పులి దాడి చేసిం దని వెల్లడించారు. ఈ దాడిలో రెండు ఆవులు, ఒక లేగ దూడను హతమార్చిందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి పెద్ద పులి పాదముద్రలు గుర్తించి వివరాలను నమోదు చేశామన్నారు. రోంపల్లికి చెందిన ఆవుల యాజమాని బాధిత రైతు వివరాలను పరిహారం కోసం వివరాలను పంపినట్లు పేర్కొన్నారు. పెద్దపులి కాసిపేట మండలం శివారు అటవీ ప్రాంతం నుంచి ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా తిర్యాణ మండల శివార్ల మధ్య సంచరిస్తుందని వివరించారు. తిర్యాణి, కాసిపేట మండలాల అటవీ శివారు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# అదిగో పులి.. ఇదిగో చిరుత

## కలకలం సృష్టిస్తోన్న పెద్దపులి, చిరుతలు - తీవ్ర భయాందోళనల్లో ప్రజలు



**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతాల్లో కొన్ని నెలలుగా పెద్ద పులుల గాండ్రింపులు లేక ప్రశాంత వాతావరణం కొనసాగింది. తాజాగా సిర్పూర్(టి) అటవీ రేంజి పరిధిలో మళ్లీ పులి కదలికలు ప్రారంభం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రేంజి పరిధిలోని ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోని రైతులకు సూచనలు చేస్తున్నారు. ఈ నెల 18న సిర్పూర్(టి) మండల కేంద్రంలో బామిని రాంచందర్‌కు చెందిన ఆవు మేతకు అటవీ ప్రాంతంలోకి వెళ్లగా పెద్దపులి దాడి చేసి హతమార్చింది. డివిజన్ పరిధిలో మళ్లీ పెద్దపులి కదలికలు ప్రారంభమయ్యాయని ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు నిర్ధారించారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని కాగజ్‌నగర్ మండలంలోని మెట్ ఇంధాని అటవీ ప్రాంతం మహారాష్ట్ర రాజురా అటవీ ప్రాంత సరిహద్దు కలిసి ఉండటంతో.. ఆ రాష్ట్రంలోని తడోబా అటవీ ప్రాంతం నుంచి కాగజ్నగర్ అటవీ డివిజన్‌లోకి పులులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏటా వేసవిలో డివిజన్ పరిధిలోని మాలిని, చీలపల్లి, వేంపల్లి అటవీ ప్రాంతం నుంచి కొండపల్లి మీదుగా.. బెజ్జూరు అడవుల్లోకి వెళ్లేందుకు పులులు మార్గాలను ఎంచుకొని తిరుగుతుంటాయి. ఎస్-13 పెద్దపులి కొన్నేళ్లపాటు మహారాష్ట్రకు వెళ్లి మళ్లీ ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలుస్తోంది. సిర్పూర్(టి) అటవీ రేంజి పరిధిలో పెద్దపులి కదలికలు ఉండగా.. మరోవైపు కాగజ్‌నగర్, పెంచికల్‌పేట అటవీ రేంజి పరిధిలో చిరుతపులి కదలికలను అధికారులు గుర్తించారు. దీంతో వారు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గత వారంలో కొత్తసార్సాల గ్రామానికి అతి సమీపంలోనే అదే గ్రామంలో రైతు బూరం పోశంకు చెందిన పశువును చిరుత హతమార్చింది. ఈ ఘటనకు పాల్పడింది చిరుతే అని పాద ముద్రలను బట్టి అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రేంజి అధికారి అనిల్కుమార్, ఇన్చార్జి ఎఫ్ఎస్ సుభాన్‌గోరి ఆధ్వర్యంలో.. సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి.. అటవీ ప్రాంత గ్రామాలైన సార్సాల, దరగపల్లి, పోతెపల్లి, బొంబాయిగూడ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. రేయింబవళ్లు గస్తీ చేప దుతున్నారు. చిరుత, పెద్దపులి కదలికలు ఉన్నందున పంట చేన్లకు వెళ్లే రైతులు గుంపులుగా, చప్పుళ్లతో వెళ్లాలని సూచిస్తున్నారు. అడవుల్లో మొక్కలు నాటుతున్న సమయంలో పులుల కదలికలు అటవీ అధికారులకు తలనొప్పిగా మారింది.





### 25న తహసీల్ కార్యాలయం ఎదుట

# జర్నలిస్టుల ఆందోళన

**నిర్మల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని కోరుతూ ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీందర్ వెంకయ్య గారి భూమయ్య తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించడం జరిగింది. జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇంటి స్థలాల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో అనేక చోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ, నిర్మల్ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియలో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి, మొదటి దశగా 25వ తేదీన మండల స్థాయిలో నిరసన చేపట్టాలని నిర్ణయించారు. అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నారు. రెండో దశలో 29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

# గణేశ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగాకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకొని ఆదర్శంగా ఉండాలని హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావుదేశ్ పాండే, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ కోరారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో గణేశ మండలి నిర్వాహకులతో గురువారం పోలీసులు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డీజే సౌండ్లను పెట్టుకోవద్దని, ఎలాంటి గొడవలకు తావులేకుండా శోభయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని కోరారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులు నిరంతరం



కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. సీఐ ఆకుల అశోక్ మాట్లాడుతూ గణేశ్ మండపాల ఏర్పాటు, నవ రాత్రి ఉత్సవాల నిర్వహణకు తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్ రాజ్ , ఏఎస్సై చాంద్ పాషా, పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సిర్పూర్ నుంచే పోటీ చేస్తా : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ నియోజకవర్గం నుంచే నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అయితే పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి మళ్లీ పార్టీలో వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మండిపడ్డారు. అందుకే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఉద్దేశించి మండిపడ్డారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. మన ప్రాంత సంపాదను ఆంధ్రకు తరలించిన ఆ వ్యక్తి మళ్ళీ పార్టీలోకి వస్తే మన ప్రాంతం నాశన మవుతుందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కేటీఆర్ దృష్టి తీసుకెళ్ళినట్లు చెప్పారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలిచేలా నాయకులు కృషి చేయాలని సూచించారు.





### గణేష్ ఉత్సవాలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

**నిర్మల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలో గణేష్ విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జన ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం ఏఎస్పీ రాజేష్ మీనాతో కలిసి ఆయన పట్టణంలోని బుధవారపేట్ నం.01 గణేష్ మండపం నుండి ఓల్డ్ బస్టాండ్, బాగులవాడ చౌక్ (ఎంఎల్ఏ క్యాంపు ఆఫీస్), గుల్జార్ మార్కెట్, గాంధీ చౌక్ మార్గంగా బంగల్‌పేట్ చెరువు నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో శానిటేషన్, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు, భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య విభాగాలు సమన్వయంతో ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉంటాయని, ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించి, సహకరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకల్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

**నిర్మల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ కింద ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వెల్లడించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన జనాభాకు విద్య, వైద్యం, మౌలిక ఆర్థిక సదుపాయాలు అందించడంతో పాటు, గ్రామ స్థాయిలో పాలనను బలోపేతం చేయడం అభియాన్ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గిరిజనులు వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రతీ ప్రభుత్వ పథకం ప్రతి అర్హుడి వరకు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకురావాలన్నారు. 18 లైన్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఇప్పటికే నిర్మల్ జిల్లాకు చెందిన 7 మంది మాస్టర్ ట్రైనర్లు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి పి.రామారావ్, జిల్లా పంచాయతీ అధికారి



శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి. రాజ నర్సయ్య, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పశుసంవర్ధక శాఖ అధికారి రాజేశ్వర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి సందీప్, వైద్య శాఖ అధికారులు సౌమ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
పండుగలను ప్రజలందరూ సమన్వయంతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ లో ఎస్. పి. కాంతిలాల్ సుభాష్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏ ఎస్.పి. చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి గణపతి నవరాత్రులు, మిలాద్ ఉన్ నబి వేడుకల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, మస్జిద్ కమిటీ ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పండుగలను ప్రజలందరూ కలిసి సామరస్యంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. గణేష్ మండపాల వద్ద ట్రాఫిక్ జాం కాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సౌకర్యం, మండపాల వద్ద పారిశుధ్యం పనులు చేపట్టాలని, నిమజ్జనం రోజు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారులపై గుంతలు పూడ్చాలని, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండల కేంద్రాలలో నిమజ్జనం జరిగే ప్రాంతాలలో మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిమజ్జనం రోజున గణేష్ శోభయాత్రలను నిర్వాహకులు వరుస క్రమంలో ఉండేలా పోలీస్ అధికారులకు సహకరించాలని, భారీ శబ్దాలు రాకుండా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ప్రజలందరూ మతసామరస్యంతో పండుగలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీరామానుజం, ఎక్సైజ్ పర్యవేక్షకులు జ్యోతి కిరణ్, విద్యుత్ ఎస్. ఈ. శేషరావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, తహసిల్దార్లు రియాజ్ అలీ, మధుకర్, సి. ఐ.లు, ఎస్. ఐ.లు, సంబంధిత అధికారులు, శాంతి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



### వృద్ధాశ్రమాలు లేని

# సమాజం రావాలి

## న్యాయమూర్తి కాసమల సాయి కిరణ్

**లక్షెట్టిపేట, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నేటి సమాజంలో కనుమరుగవుతున్న నీతినియమాలు, మానవీయ విలువలను పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయమూర్తి కాసమల సాయి కిరణ్ పిలుపునిచ్చారు. వృద్ధాశ్రమాలు లేని సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారి హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలు పడి పిల్లలను పెంచి పెద్ద చేస్తే, నేడు సమాజంలో వృద్ధులను ఆశ్రమాలకు అంకితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల మీద ప్రేమతో తల్లిదండ్రులు ఆస్తులన్నీ రాసి ఇవ్వడం ఆ తర్వాత నెల వారి ఖర్చుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడం సాధారణంగా మారిందన్నారు. పెద్ద మనుషులు పసి పిల్లలతో సమానమని వారికి చట్టం అనేక రకాల హక్కులను రాజ్యాంగంలో కల్పించిందని వివరించారు. ముఖ్యంగా పిల్లలకు తల్లిదండ్రులు ఆస్తులు రాసిచ్చేటప్పుడు కొన్ని షరతులు విధించాలని అప్పుడే గిఫ్ట్ డీడ్, సెల్ డీడ్ లాంటివి పెద్దలకు అనుకూలంగా ఉంటాయన్నారు. జీవితకాలం పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులను అనాథ ఆశ్రమాల్లో వదిలిపెట్టడం చాలా దారుణమైన విషయమన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బాధ్యతగా పెంచే క్రమంలో ఎన్నో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్, పద్మ, కారుకూరి సురేందర్,ఏజీపీ వేల్పుల సత్యం, రెడ్డిమల్ల ప్రకాశం, సుమన్ చక్రవర్తి, రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ నేరెళ్ల రాజమల్లయ్యతో పాటు పలువురు రిటైర్డ్ ఎంప్లాయిస్, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలసదనం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో చేపట్టిన బాలసదనం భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాలసదనం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవనం నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు నిర్మాణ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ జరిపి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# విద్యా, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ సారించాలి





## కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, వంటశాల, భోజన నాణ్యత, విద్యా బోధన విధానం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటాడుతూ, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక విద్యను బోధించాలని, ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వచ్చే నెల నాటికి విద్యార్థులలో విద్య అభ్యసన సామర్థ్యాల పురోగతి లేకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులు వినియోగించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




### విద్యార్థి దశ నుండే చట్టాలపై

# అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
విద్యార్థి దశ నుండే అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, బృందం ఆధ్వర్యంలో బేలా మండలంలోని సిర్సన్న ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, లింగ సమానత్వం అంశాలపై జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం, విద్యార్థులతో కలిసి మొక్కల నాటారు. బేటీ బచావో- బేటీ పడావో క్యాంపైన్‌లో భాగంగా సెల్ఫీలు దిగారు. టీమ్ సభ్యులు కృష్ణవేణి, కోటేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పశువుల్లో వ్యాధుల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి



**బజార్‌హత్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
రైతులు తమ పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి పర్వీజ్ అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని దేగామా గ్రామంలో గొర్రెల్లో వచ్చే నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులైన లంపి స్కిన్ బ్ల్యూటంగ్ (నీలి నాలుక వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువుల్లో, గొర్రెలకు ఈ వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలోపశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ బంద్‌కు బీజేపీ పిలుపు

**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నాలుగు రోజులుగా చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా, జీవో నెంబర్ 49 రద్దు చేయాలని బీజేపీ నాయకులు శుక్రవారం కాగజ్ నగర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, ప్రభుత్వం దిగి రాకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి 23న మహాధర్నా

**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాదులో చేపట్టే మహాధర్నాను ఉపాధ్యాయులందరూ విజయవంతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుండారపు చక్రపాణి, ప్రధాన కార్యదర్శులు రాజావేణు కోరారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచిన ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందని అన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన ఎన్నికల హామీలను అమలుపరచడం లేదని విమర్శించారు. వెంటనే పీఆర్సి ని అమలు చేసి, పెండింగ్ డిఏలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ ను రూపొందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 పిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, డీఎడ్, బిఎడ్ అర్హతలు ఉన్న ఎస్జీటీకి పిఎస్ హెచ్‌ఎం ప్రమోషన్లను కల్పించాలని కోరారు. పండిత్, పీఈటీల అప్గ్రేడేశం ప్రక్రియ పూర్తయినందున జీవో 2,3,9,10 లను రద్దుచేసి జీవో 11,12 ల ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని కోరారు. జూలై 23, 24, 25 తేదీలలో మండల తాసిల్దార్ ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండాలు సమర్పించామని, రెండవ దశలో ఆగస్టు 5న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి కలెక్టర్ల ద్వారా వినతి పత్రాలు కూడా అందజేశామని ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనివార్య పరిస్థితులలో ఈనెల 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



# పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దు

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్



**బెజ్జూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నదీ పరివాహక ప్రాంతం పాపన్నపేట్, తలాయి, తిక్కపల్లి, సోమిని ప్రాంతాలలో ఉప్పొంగి పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని మీకు అండగా ప్రజా ప్రభుత్వం ఉందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండలంలోని ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతుకు ఎకరానికి రూ.10వేలు ప్రభుత్వం నుంచి అందజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కష్ణారావు కూడా జిల్లా పర్యటనలో పరిహారం ఇవన్నట్లు తెలిపారన్నారు. అలాగే ప్రతి రైతు వద్దకు వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి నష్టం వాటిల్లిన వివరాలు సేకరిస్తారని తెలిపారు. అధికారులు, రాజకీయ నాయకుల ప్రలోభాలకు గురికాకుండా నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలని వ్యవసాయ శాఖ మండల అధికారి రామకృష్ణను ఆదేశించారు. అలాగే నష్టపోయిన రైతులు ఎమ్మెల్సీతో మాట్లాడుతూ గతంలో నష్టం జరిగినప్పుడు సిర్పూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పరిహారం వచ్చిందని, బెజ్జూర్ మండలం తప్పా అని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ అధికారులు నిర్ణీతమైన సమయాల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అన్నారు. పంట నష్టపోయిన రైతుకు పరిహారం రాకుండా ఉంటే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే యూరియా రైతులందరికీ అందుతుందని, కొంత సమయం పట్టినా సరిపడ యూరియా వచ్చేలా అధికారులతో మాట్లాడతానన్నారు. సమస్యలు ఉన్న రైతులు తహశీల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ శాఖ మండల అధికారి రామకృష్ణకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### ఎర్రకుంట చెరువును పరిశీలించిన

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్

**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వే నంబర్ 45లో ధ్వంసమైన ఎర్రకుంట చెరువును గురువారం సాయంత్రం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. సోమవారం ఎర్రకుంట చెరువును కొంతమంది వ్యాపారులు ధ్వంసం తమకు జీవనోపాధి లేకుండా చేశారని కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత సమక్షంలో మత్స్యకారులు, రైతులు జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎర్రకుంట చెరువును పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించడంతో గురువారం సబ్ కలెక్టర్ మనోజ్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఎర్రకుంట చెరువును పరిశీలించి బాధితుల నుండి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్లు తెలిపారు.

### ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా

## వైద్య అధికారుల తనిఖీలు



**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఐ యాక్టివిస్ట్ మొహమ్మద్ షెహబాజ్ ఫిర్యాదు మేరకు డాక్టర్ సీతారాం ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిగాయి. ర్యాంప్ సౌకర్యం లేకపోవడం, ధరల పట్టికలు ప్రదర్శించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. డాక్టర్ అజీమ్, షఫీ, రమేష్ చంద్ర ఈ తనిఖీల్లో పాల్గొని, నిబంధనలు పాటించని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు.

### జన్నారం మండలంలో 145

## ఉపాధి పనులకు శ్రీకారం



**జన్నారం, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనుల జాతర సందర్భంగా 145 పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు జన్నారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తెలిపారు. శుక్రవారం నుండి మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనుల జాతర ప్రారంభమవుతుందని, ఇందులో వివిధ పనులతో పాటు అంగన్వాడి, తదితర భవనాలకు కూడా భూమి పూజ జరుగుతుందని, ఎమ్మెల్యే పర్యవేక్షణలో ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సబ్ కలెక్టర్‌కు వినతి



**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న బెల్లంపల్లి వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు ఆయన కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఈ సందర్భంగా బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కార్కూరు సాధారణంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పాత్రికేయ వృత్తినే నమ్ముకొని ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం సంబంధిత సమస్యపై స్పందించిన సబ్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణ యాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలు కేటాయిం చడం జరుగుతుందని ఈ సందర్భంగా హామీ ఇ చ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రి కారంగం విశేషమైందని వాస్తవాలను ప్రచురించి సమాజ శ్రేయస్సు పాటుపడాలని ఈ సందర్భంగా సూచించారు. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్లోని సమస్యలను తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే పరిష్కరించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లికి సబ్ కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన మనోజ్ ను బెల్లంపల్లి అధ్యక్షుడు కారుకూరి సదానందం ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, కోశాధికారి నవీన్, కార్యవర్గ సభ్యులు రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## మహారాష్ట్ర డీజేలు ఉపయోగిస్తే కేసులు తప్పవు

### ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

గణపతి నవరాత్రి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లా నందు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి ఏర్పాట్లను చేస్తుందని ఆదిలాబాద్ డిఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డీజేలకు అనుమతులు లేవని, డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో మండపాల వద్ద ఉపయోగించే సౌండ్ బాక్సులకు, మైక్‌సెట్‌లకు డీఎస్పీ కార్యాలయం నుండి అనుమతులను పొందాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నవరాత్రి ఉత్సవాలలో డీజేలకు అనుమతులు ఉండవని, మహారాష్ట్ర నుండి డీజే లను తీసుకువచ్చి అద్దెకు ఇచ్చే యజమానుల పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, డీజే లను సీజ్ చేసి, యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత నియమ నిబంధనలను అతిక్రమించకుండా నవరాత్రి ఉత్సవాలను భక్తి భావనతో శ్రద్ధగా ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క గణపతి మండపానికి పోలీసు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లో గణపతి ఏర్పాటు, నిమజ్జనం తేదీలు, నిమజ్జన దారి, మరియు నిర్వాహక కమిటీ సభ్యులు, వాలంటీర్లు, వాహనం, గణపతి మరియు మండపం ఎత్తు, వంటి వాటి వివరాలను నమోదు చేసి అనుమతులను పొందాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దుతో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు డీజే లను అనధికారికంగా మహారాష్ట్ర నుండి తీసుకువచ్చిన వారి డీజే సీజ్ చేయబడతాయని తెలిపారు. గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు అనవసరంగా డీజీలకు డబ్బులు వృధా చేసుకోకూడదని సూచించారు. సౌండ్, మైక్‌లకు అనుమతి తీసుకోవాలన్నారు.



### శాంతియుత వాతావరణంలో

## ఉత్సవాలు నిర్వహించుకోవాలి

### శాంతి కమిటీ సమావేశంలో ఏసీపీ ప్రకాశ్

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఎలాంటి అపశృతి జరుగకుండా జాగ్రత్తలు పాటిస్తూ నవరాత్రి ఉత్సవాలు నిర్వ హించుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. గురువారం ఎంకన్వెన్షన్ హాల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల శాంతి కమిటీని ముఖ్యఅతిథులుగా ఆర్డీవో శ్రీనివాస్ రావు, నగరపాలక కమిషనర్ సంపత్, తహసీల్దార్ రఫాతుల్లా హుస్సేన్, ఫైర్ జిల్లా ఫైర్ అధికారి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గణేష్ మండపానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినవారిని బైండోవర్ చే స్తామని, గణేష్ మండపాల వద్ద, గణేష్ నిమజ్జనం ఉత్సవం సందర్భంగా ఎవ్వరు కూడ మద్యం సేవించరాదని సూచించారు. మండపాల వద్ద న్యూసెన్స్‌కు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ ముఖ్యంగా మండపాల వద్ద ఎలక్ట్రిసిటీ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏ చిన్న పొరపాటు జరిగిన విద్యుదాఘాతంతో ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు పాటించాలన్నారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా యువత భక్తి శ్రద్ధలతో పాల్గొనాలని అనవసరమైన గొడవల్లో తల దూర్చి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు సమయం ప్రకారం రాత్రి 12లోపే కార్యక్రమం పూర్తి చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా ఇష్టారీతిన డీజేల సౌండ్ పెట్టి ఇబ్బంది కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



## 'విశ్వంభర' టీజర్ వచ్చేసింది!

మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విశ్వంభర నుంచి ఆడిపోయే అప్డేట్ ఇచ్చారు మెగాస్టార్ చిరంజీవి. వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటించారు. అలాగే సినిమా ఆలస్యానికి గల కారణాలను వివరించారు మెగాస్టార్. "సినిమాలోని సెకండ్ ఆఫ్ అంతా కూడా గ్రాఫిక్స్ పైనే ఆధారపడి ఉంటుంది. అందుకే ఎటువంటి విమర్శలకు తావివ్వకుండా అత్యుత్తమైన గ్రాఫిక్స్ అందించే ప్రయత్నమే సినిమా ఆలస్యానికి కారణమని చెప్పారు. 'విశ్వంభర' ఒక అందమైన చందమామ కథలా సాగే చిత్రమని, చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు అందరిని ఆకట్టుకునే విధంగా సినిమా ఉండబోతుందని తెలిపారు. 'బింబిసారా' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. గతంలో సినిమాకు సంబంధించిన ఒక చిన్నగ్లిమ్ప్స వీడియో రిలీజ్ చేయగా.. అందులోని గ్రాఫిక్స్‌పై తీవ్ర విమర్శలు వెలువెత్తాయి. ఏ మాత్రం నాణ్యత లేని గ్రాఫిక్స్ ఉపయోగించారని విపరీతంగా ట్రోల్ చేశారు నెటిజన్లు. దీంతో ప్రేక్షకులకు అత్యుత్తమ గ్రాఫిక్స్, విజువల్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి ప్రయత్నిస్తున్నారు మేకర్స్. ఈ సినిమా గ్రాఫిక్స్ కోసం ఇంటర్ నేషనల్ టెక్నీషియన్స్ తో కలిసి పనిచేస్తున్నారు. ఒక సోషియో ఫాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో గ్రాఫిక్స్ ప్రధానంగా ఉండబోతున్నాయి. ఇదిలా ఉంటే ఈ చిత్రంలో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తున్నారు. దాదాపు 18 ఏళ్ళ తర్వాత ఈ జంట మళ్ళీ కలిసి స్క్రీన్ పై సందడి చేయబోతున్నారు. 2006లో స్టాలిన్ సినిమాలో త్రిష-చిరంజీవి కలిసి నటించారు. ఆషికా రంగనాథ్, . కునాల్ కపూర్, ఇషా చావ్లా, రావు రమేష్, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజా అప్డేట్ ప్రకారం.. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ మౌని రాయ్ తో ఓ స్పెషల్ సాంగ్ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 100 మంది డాన్సర్లు, మౌని రాయ్ గ్లామర్, ఎనర్జిటిక్ స్టెప్పులతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవనున్నట్లు సినీ వర్గాల్లో టాక్. భీమ్స్ మ్యూజిక్ లో చిరు, మౌనిరాయ్ థియేటర్‌లో ఫుల్ జోష్ నింపనున్నారు.




## వేటకు కదిలిన అనుష్క..

టాలీవుడ్ లేడీ సూపర్ స్టార్ అనుష్క శెట్టి చాలా కాలం గ్యాప్ తర్వాత 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మాదకద్రవ్యాల మాఫియా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మెల్లిగా మూవీ ప్రమోషన్స్ మొదలు పెట్టారు మేకర్స్. సినిమాకు సంబంధించిన ప్రచారం చిత్రాలను, పాటలను ఒకదాని తర్వాత ఒకటి విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా మూవీ నుంచి సెకండ్ లిరికల్ వీడియో 'దస్సోరా' పాటను రిలీజ్ చేశారు. "తూరుపు కనుమన నడుమింటే... కారడవుల్లో కాలెట్టే...సిరుతై ఉరికే యమజట్టే... వేటకి కదిలే ఘాటీ"...'అంటూ ర్యాప్ స్టైల్ సాగిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో అనుష్క పాత్రను తెలియజేసేలా ఈ పాట లిరిక్స్ ఉన్నాయి. సాగర్ నాగవల్లి సంగీతం అందించిన ఈ పాటను గీతామాధురి, సాకేత్, శృతి రంజని కలిసి పాడారు. ఈఎస్ మూర్తి లిరిక్స్ రాశారు. యువీ క్రియేషన్స్ నిర్మాణంలో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'వేదం' తర్వాత క్రిష్- అనుష్క కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో తమిళ నటుడు విక్రమ్ మేల్ లీడ్ గా నటిస్తున్నారు. చైతన్యరావు, జగపతిబాబు, రవీంద్ర తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చివరి దశ షూటింగ్ లో ఉంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో జరిగే గంజాయి, మాదకద్రవ్యాలు, మాఫియా నేపథ్యంలో ఈ సినిమా కథ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్ లో అనుష్క గంజాయి మాఫియా డాన్ గా నోట్లో బీడీ పెట్టుకొని పవర్ ఫుల్ లుక్ లో కనిపించింది. ఒక సాధారణ మహిళగా ఉన్న అనుష్క గంజాయి వ్యాపారంలో చిక్కుకుని, చివరికి అదే వ్యాపారంలో ఒక శక్తివంతమైన వ్యక్తిగా మారింది అనేది సినిమా కథని ట్రైలర్ చూస్తే ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ట్రైలర్ చూసిన తర్వాత ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. అయితే మొదటగా ఈ చిత్రాన్ని జులై 11న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ, గ్రాఫిక్స్ పనుల వల్ల సినిమాను వాయిదా వేసినట్లు తెలిసింది. చివరికి సెప్టెంబర్ 5న విడుదలకు ముహూర్తం ఫిక్స్ చేశారు.

## 'విఠాబాయి' గా శ్రద్ధా ..

నటి శ్రద్ధా కపూర్ ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణిస్తోంది. ఇటీవలే హారర్ కామెడీ చిత్రం స్త్రీ2 తో సూపర్ హిట్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీంతో శ్రద్ధా నెక్స్ట్ ప్రాజెక్ట్స్ ఏంటి? అనే దానిపై ఫ్యాన్స్ లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో శ్రద్ధ నెక్స్ట్ ప్రాజెక్ట్ సంబంధించి నెట్టింట ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వైరల్ అవుతోంది. జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మహారాష్ట్రకు చెందిన 'విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్' బయోపిక్ లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తుండగా.., దినేష్ విజన్ నిర్మిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో శ్రద్ధ 'విఠాబాయి' గా కనిపించబోతుంది. విఠాబాయి 'లవాని', 'తమాషా' నృత్యాలకు ప్రసిద్ధి. అయితే విఠాబాయి అభిమానుల్లో 'తమాషా క్వీన్' అనే పేరుతో ప్రసిద్ధి చెందిన కారణంగా మొదట ఈ సినిమాకు మొదటగా 'తమాషా' అనే టైటిల్ పెట్టాలని నిర్ణయించుకున్నారు. కానీ ఆ తర్వాత 'విట్టా' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కేవలం ఆమె కళారూపం గురించి మాత్రమే కాకుండా, విఠాబాయి వ్యక్తిగత జీవితాన్ని కూడా సినిమాలో చూపించబోతున్నారట. అందుకే 'తమాషా' నుంచి 'విట్టా' అని టైటిల్ చేంజ్ చేసినట్లు సమాచారం. అలాగే మహారాష్ట్ర జానపద కళకు అది ఎంత ముఖ్యమైనదో కూడా ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఇదిలా ఉంటే .. శ్రద్ధా కపూర్ గత సినిమాలలో గ్లామర్ పాత్రలకు ప్రసిద్ధి చెందారు. కానీ, ఇప్పుడు విఠాబాయి లాంటి ధైర్యవంతురాలి, నిజమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రలో నటించడం ఆమెకు ఒక సవాలు. ఈ సినిమాతో శ్రద్ధ తన నటనలో మరింత పరిణతి సాధిస్తారని, ఇది ఆమె కెరీర్‌కి ఒక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని నెటిజన్లు భావిస్తున్నారు.



# సమంతకు ఏమైంది?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఈ మధ్య సినిమాల్లో కనిపించకపోయినా.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది. తరచూ లేటెస్ట్ ఫ్యాషన్ ఫొటో షూట్లు, ఫిట్ నెస్ వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది సామ్. అయినప్పటికీ సామ్ సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు, మూడు సినిమాలతో బిజీగా ఉండే సామ్ కి.. ఇప్పుడు అవకాశాలు రావట్లేదా? అని అనుకుంటున్నారు నెటిజన్లు. ఈ క్రమంలో తాజాగా ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' కిఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ తన సినీ కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఇందులో తాను సినిమాల్లో తక్కువగా కనిపించడానికి గల కారణాలను కూడా వివరించింది. 'గ్రాజియా ఇండియా' ఇటీవలే సామ్ ఫొటోను తమ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజ్‌పై ప్రింట్ చేసింది. ఈ సందర్భంగానే ఆమెతో ఇంటర్వ్యూ తీసుకుంది. ఇంటర్వ్యూలో సామ్ మాట్లాడుతూ.. కెరీర్ లో ఎన్నిసినిమాలు చేశామనే దానికంటే ఎంత మంచి చిత్రాలు చేశామనేదే ముఖ్యమని తెలిపింది. ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నాను. గతంతో పోలిస్తే.. ఇప్పుడు నాలో చాలా మార్పు వచ్చింది. ఎన్నో మంచి పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఇప్పుడు ఫిట్ నెస్, సినిమాలు రెండిపైనా దృష్టి సారించాను. మంచి కథలు, సినిమాలు, సిరీస్ లలో భాగమయ్యాను. నేను చేసే చిత్రాలన్నీ కేవలం ఫ్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేస్తున్నవి కాదు! అవన్నీ కూడా నా మనసుకు దగ్గరైన కథలు అని వివరించింది సామ్. అలాగే శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో తక్కువ ప్రాజెక్టులు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. "ఇక నుంచి ఒకేసారి నాలుగు, ఐదు ప్రాజెక్టులు చేయనని, తన శరీరం చెపింది మాత్రమే వింటానని చెప్పుకొచ్చింది. తక్కువ ప్రాజెక్టులు చేసినప్పటికీ.. ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే ముందుకొస్తానని తెలిపింది. సినిమాల సంఖ్య తగ్గినా.. వాటి నాణ్యత మాత్రం పెరుగుతుంది" అని చెప్పింది సామ్. నటిగానే కాకుండా నిర్మాతగా కూడా సత్తా చాటుతోంది. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల బ్యానర్ ద్వారా యంగ్ టాలెంట్ ని ఎంకరేజ్ చేస్తూ సరికొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఇటీవలే సామ్ నిర్మించిన 'శుభం' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. మహిళల్లో సీరియల్ అడిక్షన్ ఏ రేంజ్ లో ఉంటుంది అనే అంశానికి హారర్ ఎలిమెంట్స్ జోడించి ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే రూపొందించారు. సామ్ చివరిగా 2023లో 'ఖుషీ' సినిమాలో కనిపించింది. ఆ తర్వాత రీసెంట్ సిటాడెల్ సీరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం తన సొంతం బ్యానర్ లో 'మా ఇంటి బంగారం', 'రంగమార్తాండ' సినిమాలు చేస్తోంది. కానీ ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్స్ కి సంబంధించి ఎలాంటి అప్డేట్స్ లేవు.



## రోడ్లపైకి పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**జన్నారం, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువులు రాకుండా చూడాలని, వాటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు సాయి నాయక్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనూషకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జన్నారం పట్టణంలోని రోడ్లపై అధికంగా ఆవులు తిరగడం వలన తరచూ తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణ కోసం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు, వినీత్, రఘు, రాకేష్, సుమిత్,సాయి రెడ్డి, బన్నీ, పూర్ణచందర్ పాల్గొన్నారు.

## లక్షెట్టిపేటలో ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపు ప్రారంభం

**లక్షెట్టిపేట, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

లక్షేటిపేట పట్టణంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపు పనులను ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఏడి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏఈ గణేష్, లైన్ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది గజిబిజిగా ఉన్న కేబుల్ లను సరి చేశారు. ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్లకు సూచనలు ఇస్తూ, తమ వైర్లు విద్యుత్ స్తంభానికి ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని అధికారులు తెలిపారు.

## ఉత్తమ కార్యదర్శి లావణ్యకు సన్మానం

**జన్నారం, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మేక లావణ్య ఇటీవలే కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదగా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా గురువారం గ్రామంలోని యువత వారికి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ముందు ముందు గ్రామానికి మరిన్ని గొప్పగా సేవలు అందించి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. అలాగే సెక్రటరి లావణ్య మాట్లాడుతూ.. నాకు ఈ అవార్డు రావడానికి కారణం గ్రామంలోని ప్రజలు నాయకులు యువత సహకారం వల్లనే నాకు ఈ గౌరవమైన బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు రావడం జరిగిందని, గ్రామంలోని ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పెరుగు మల్లికార్జున్, కూకటికారు శంకర్, రేగుంట ప్రదీప్, గుగ్లావత్ రవి నాయక్, కామెర శివాజీ, కూకటికారు గంగాధర్, దేవ రాజమౌళి, రత్నం రాజమౌళి, లిన్నేక్, జునుగూరి వెంకట్, అటుకపురం వెంకటేష్, గ్రామ పెద్దలుసాధం చిన్నయ్య, గ్రామపంచాయితీ సిబ్బంది సిందం శ్రీనివాస్, కూకటికారి ఆనందం పాల్గొన్నారు.



# పేదల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు

## కల్యాణ లక్ష్మిచెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పాయల్

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన కుటుంబానికి ఆర్థిక భారం నుండి కాస్త ఉపశమనం కలిగించేందుకు ఒక లక్ష నగదు ఎంతో కొంత దోహదపడుతోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గురు వారం ఆయన పాల్గొన్నారు. జైనద్, బేల, సాత్నాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు సహకరించాలని కోరారు. పేదవారు ఆడపిల్లల పెళ్లిల్లు చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నా రు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ దీపక్ తివారి




**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎపిఓలు, ఎపిఎంలతో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కొనసాగుతున్న సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనుల జాతర, ఉల్లాస్ ద్వారా వయోజనులకు విద్య, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వైద్య ఆరోగ్య సేవలు, ఉపాధి హామీ పనులు, వనమహోత్సవం, భారీ వర్షాల వలన దెబ్బతిన్న రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, పంచాయతీ కార్యదర్శుల హాజరు, మండల పంచాయతీ అధికారుల పర్యవేక్షణ, పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ నమోదుపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, వన మహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల వల్ల గ్రామాలలో విష జ్వరాలు, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాలలో పర్యటించి శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, గ్రామాలు, రహదారులు, మురుగు కాలువలలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు హాజరుపై మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న సంక్షేమ అభివృద్ధి పనులు నిర్ణిత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత రైతులకు అండగా ఉంటాం

- పంట నష్ట పరిహారం ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో జోగు రామన్న పర్యటన
- మాజీ మంత్రితో కంటతడి పెట్టుకున్న రైతులు



**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

భారీ వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఎకరానికి రూ. 25 వేలు చెల్లించాలని, పంట నష్ట పరిహారం చెల్లించేంతవరకు రైతులకు అండగా ఉంటామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న రైతులకు భరోసా ఇచ్చారు. గురువారం పెన్‌గంగా వరద ముంపు గ్రామాల్లోఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జైనథ్ లోని ఆనంద్ పూర్, కాప్రి, కరంజి, సాంగిడి, భేదో డా తరితర గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. కాగా సాంగిడి గ్రామానికి చెందిన లచ్చన్న అనే రైతు తన మూడు ఎకరాల సోయా పంట పూర్తిగా నీట మునిగిందని మాజీ మంత్రితో కన్నీరు పెట్టుకున్నారు. పంట పూర్తిగా నష్టపోయి నాలుగు రోజులు అవుతున్న ఇంతవరకు ఎంపీ, ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు, అధికారులు సైతం ఎవ్వరూ వచ్చి తమ గోడులు ఆలకించలేదని ఆవేదన వెళ్లగక్కారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి జూప ల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో రైతుల గోడు వినకుండానే తన పర్యటనను ముగించుకోవడం సరికాదన్నారు. వర్షాలు కురిసి, పంట నష్టం జరిగి ఐదు రోజులు గడుస్తున్న ఇంతవరకు అధికారులు సర్వేకు చేపట్టకపోవడం ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రౌతు మనోహర్, గోవర్ధన్, లింగారెడ్డి, ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.



## అర్హతకు మించి ఆర్ఎంపీలు వైద్యం చేయొద్దు

### పీహెచ్‌సీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, అర్హతకు మించి వైద్యం చేస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ నరేందర్ రాథోడ్ స్పష్టం చేశారు. గురువారం సోనాల మండల కేంద్రములోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్ప త్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి తగు సూచనలు చేయడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో ఓపి విభాగంలో ఎక్కువగా కేసులు నమోదవుతున్న గుట్ట పక్క తండా, గుర్రాల తండా గ్రామాలలో శానిటేషన్ ను పరిశీలించి ఫీల్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. సోనాల మండల కేంద్రంలోని ఆర్ఎంపీ క్లినిక్ లను తనిఖీ చేస్తూ తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సోనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి, సూపర్వైజర్ కవిత, హెల్త్ అసిస్టెంట్ లింగారెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ యశోద, ఏఎన్ఎం అనసూయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**హద్దుమీరీ వైద్యం చేస్తే చర్యలు..**

ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు హద్దు మీరి వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా సూపర్డెంట్ షఫీ , ప్రోగ్రాం అధికారి అజీముద్దీన్ అన్నారు. గురువారం బెజ్జూర్ మండలంలోని ఉట్ సారంగపల్లి గ్రామంలో అనుమతులు లేకుం డా వైద్యం చేస్తున్న ఇంటినీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రైవేటు వైద్యం నిర్వహిస్తున్న నేహా మండల్‌పై విచారణ చేపట్టిన ట్లు తెలిపారు. మారుమూల గ్రామాలలో రోగులకు ఎలాంటి అవగాహన లేకపోయినా ఇంజక్షన్, టాబ్లెట్లు ఇవ్వడంతో కిడ్నీ లివర్ గుండె ఊపిరితిత్తులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద వైద్య సేవలు పొందాలని సూచించారు. ఓ ల్యాబ్‌లో అనుమతులు లేకుండా రక్త పరీక్షలు నిర్వహించడంపై నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. అధికారులు తనిఖీలకు వస్తున్నట్లుగా సమాచారం రావడంతో పలు ప్రాంతాలలో ప్రైవేటు క్లినికులు, ల్యాబ్‌లో మూసివేశారు. ఈ కార్యక్రమంలో డివైఎన్ఓ రమేష్ చంద్ర, సిబ్బంది ఉన్నారు.







# కాడెద్దుల పండుగ.. కనుల విందుగ

**శ్రావణ అమావాస్య సందర్భంగా పొలాల అమావాస్య (పోలాల అమావాస్య) జరుపుకొంటారు. పిల్లల యోగక్షేమాలు, తమ సౌభాగ్యం కోసం మహిళలు పొలాల వ్రతం చేస్తారు. వ్రతంలో భాగంగా కంద పిలకలను పూజలో ఉంచుతారు. పెద్ద కంద మొక్కను తల్లిగా, చిన్నదాన్ని పిల్లగా భావించి పూజిస్తారు. ఈ పిలకలను అమ్మవారిగా తలచి వాటికి తోరాలు కడతారు. ముందుగా వినాయకుడి పూజ చేస్తారు. తర్వాత సంతాన లక్ష్మిని గానీ, మంగళగౌరీదేవిని గానీ కంద పిలకల్లోకి ఆవాహన చేసి షోడశోపచారాలతో పూజ నిర్వహిస్తారు. తర్వాత వ్రతకథ చదివి అక్షతలు శిరస్సుపై చల్లుకుంటారు. వ్రతం పూర్తయిన తర్వాత సంతానవతి అయిన ముత్తయిదువను పూజించి అమ్మవారికి నివేదించిన తొమ్మిది పూర్ణాలను, ఒక తోరాన్ని ఆమెకు వాయినంగా సమర్పిస్తారు.**

- బసవన్నకు రైతుకు మధ్య అనుబంధానికి ప్రతీక
- పొలాల పండుగకు ఎడ్లను అలంకరిస్తున్న రైతులు
- బసవన్నలకు గ్రామాల్లో ప్రత్యేక పూజలు..
- వారసంతలో పొలాల అమావాస్య సందడి
- నేడు పొలాల అమావాస్య.. దుక్కిటెద్దుల పండుగ
- 23న తాంసిలో అధికారికంగా 'పొలాల పండుగ'
- హాజరుకానున్న పలువురు ప్రముఖులు..
- ఏర్పాట్లను పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్

**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ప్రస్తుతం వ్యవసాయ రంగం నూతన సాంకేతికతతో కొత్తపుంతలు తొక్కుతోంది. ఎన్నో ఆధునాతన మార్పులతో దూసుకుపోతోంది. ఎన్ని మార్పులొచ్చినప్పటికీ దుక్కిదున్నటంలో అన్నదాతకు ఆది నుంచి నేటి వరకూ అండగా నిలుస్తున్నవి బసవన్నలే. వేల సంవత్సరాలుగా రైతుకి ఎద్దుకి ఉన్న అనుబంధం విడదీయనిది. అందుకే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా బసవన్నల కోసం ఏకంగా ఓ పండుగనే చేస్తారు. అదే పొలాల పండగ. రైతుల్లానే కల్లాకపటం లేని మనస్తత్వానికి ప్రతీకలు బసవన్నలు. అందుకే తనకు తోడ్పాటునందించే ప్రతి అంశానికి రుణగ్రస్థులై ఉండే రైతులు, ఆది నుంచి అండగా ఉంటున్న ఎద్దుల కోసం ప్రత్యేకంగా ఓ పండుగనే నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏటా శ్రావణ అమావాస్య రోజున పొలాల పేరుతో బసవన్నల కోసం పండగ నిర్వహిస్తారు. ఉత్సవానికి ఒకరోజు ముందు నుంచే ఎద్దులతో ఎలాంటి పని చేయించకుండా కడుపు నిండా మేత వేస్తారు. మరుసటి రోజు స్నానం చేయించి అందంగా అలంకరిస్తారు. బసవన్నలను అందంగా అలంకరించిన అనంతరం కుటుంబ పెద్దతో కలిసి సభ్యులంతా వాటిని గ్రామదేవతల గుడి, హనుమాన్ ఆలయం చుట్టూ తిప్పుతారు. వాటినన్నింటినీ ఒక చోట చేర్చి గ్రామపెద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి కుటుంబసభ్యుల చేతులు మీదుగా నైవేద్య వితరణ అనంతరం తమలపాకులు తినిపించి.. మంగళహారతులు ఇస్తారు. బసవన్నల కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకుంటారు. పొలాల పండగ అనగానే ప్రతి పల్లె మురిసిపోతోంది. భాజభజంత్రీలు, డబ్బువాయిద్యాల మధ్య ఊరంతా పండగ వాతావరణం నెలకొంటుంది. ఎద్దులంటే నందీశ్వరులనీ... శివపార్వతుల తనయులనీ, వాటిని పూజించటం ద్వారా వ్యవసాయం సుభిక్షంగా ఉంటుందని రైతుల నమ్మకం. అందుకే ఊరూ, వాడ ఈ పండగను ఘనంగా నిర్వహించి బసవన్నలపై రైతులకున్న అభిమానాన్ని చాటుతారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పొలాల అమావాస్యతో శ్రావణ మాసం పరిసమాప్తమవుతోంది. వ్యవసాయ పనుల నిర్వహణలో అప్పటి వరకూ అలసిపోయిన బసవన్నలకు కాస్తంత విశ్రాంతి లభిస్తుంది. ఆరుగాలం కష్టం చేసి పంటలను పండించే రైతన్నకు సాగుపనిలో తోడు ఉండే బసవన్నల(ఎద్దుల)తో విడదీయరాని బంధం. చేనులో దుక్కిదున్ని విత్తనం విత్తి న నుంచి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని ఇంటికి తెచ్చేంత వరకు ప్రతిపనిలో రైతన్నకు ఎద్దులతో ఏదో రకంగా సహాయపడుతుంటాయి. భూమిని నమ్ముకుని వ్యవ సా యం చేసే రైతులు సాగులో సహాయపడే బసవన్నలను ఎంతో ప్రేమగా చూసుకోవడంతో పాటు దైవంగా భావిస్తారు. ఎద్దులు నందీశ్వరుని అవతారంగా భావిస్తారు. శ్రావణమాసం ముగింపులో బహుళ అమావాస్య రోజున వచ్చే పొలాల పండుగకు ఎంతో విశిష్టత ఉంది. ప్రకృతిని పూజించడంతో పాటు వ్యవసాయంలో ఆరుగాలం శ్రమించే ఎద్దులను అందంగా సింగారించి ఆరాధించే అరుదైన పండుగ ఇది. వ్యవసాయ పనులు పూర్తైన క్రమంలో వచ్చే తొలిపండుగ కావడంతో రైతులు, కొన్ని





సామాజిక వర్గాల ప్రజలు పొలాల అమావాస్యను అత్యంత ఘనంగా జరుపుకోవడం అనవాయితీ. ఇతర పండుగలతో పోల్చితే ముచ్చటగా మూడు రోజులు జరుపుకునే పొలాల పండుగలో సామాజిక అంశాలు, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడుతాయి.

## బసవన్నలకు అలంకరణ..

శ్రావణమాసంలో వచ్చే చివరిపండుగగా పొలాల అమావాస్యను గ్రామీణులు భావిస్తారు. పల్లెల్లో అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ఉదయం రైతులు అటవీ ప్రాంతానికి వెళ్లి విరబూసిన జంజోరు పూలు, పత్రి ఆకులు, నారను తీసుకు వచ్చి తోరణాలు తయారుచేసి ఇంటి గుమ్మాలకు కడతారు. మట్టితో ఎద్దుల ప్రతిమలను తయారు చేసి పూజించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఎద్దులనుచెరువులు, వాగుల్లో శుభ్రంగా కడిగి ఇళ్లకు తీసుకువస్తారు. వాటి వీపుపై రంగురంగుల బొమ్మలు, జూలు, మెడలో గంటలతోపాటు ఎడ్లనుఅందంగా అలంకరిస్తారు. సాయంత్రం ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయానికి తీసుకె ళ్తారు. ఆలయం చుట్టు ఎద్దులతో ప్రదక్షణలు చేయిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

## ఎడ్లకు నైవేద్యం..

ఆలయాల్లో ప్రదక్షిణ అనంతరం ఇంటికి తీసుకువచ్చిన ఎడ్లకు రైతులు పూజలు చేసి ఆ రోజుచేసిన వంటకాలను నైవేధ్యంగా తినిపిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి విందు ఆరగిస్తారు. ఇది పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారంగా పెద్దలు చెబుతారు. ఎద్దులు లేని రైతులు తమ బంధువుల ఎడ్ల జతలను తీసుకు వచ్చి పూజలు చేస్తారు.

## బడుగా పండుగ..

పొలాల అమావాన్య మరుసటి రోజు బడుగా పండుగ జరుపుకోవడం అనవాయితీ. శ్రావణమాసంలో నెలరోజులపాటు మాంసాహారాన్ని భుజించకుండా నియమనిష్టలుపాటించి బడుగ పండగ జరుపుకుంటారు. బడుగ రోజు ఉదయం మాత్రం మహిళలు భాగస్వామ్యం ఉంటుంది. ఉదయం పూట ప్రత్యేక పూజలు చేస్తారు. పొలాల అమావాస్య రోజు ప్రత్యేకంగా మట్టితో తయారు చేసిన ఆ ప్రతిమలను ఆడబిడ్డలు గ్రామశివారు ప్రాంతంలోని చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. ఇలా సంస్కృతి సంప్రదాయాల కలబోతతో ప్రకృతిని, పశువులను పూజించి ఆరాధించడం పొలాల అమావాస్య పర్వదిన వేడుకలో మాత్రమే కనిపిస్తుంది.

## వారసంతలో పొలాల అమావాస్య సందడి

మండల కేంద్రంలోని నిర్వహించిన వారసంతలో పొలాల అమావాస్య పండుగ సందడి నెలకొంది. రైతులు ఈ రోజున తమ పశువులను ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంతలో వ్యాపారులు పశువుల అలంకరణ వస్తువులు విక్రయిస్తున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. అలాగే పండుగను పురస్కరించుకుని నిత్యావసర సరుకులు కొనుగోళ్లకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



# రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలి





**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి క్రీడాకారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ఎస్ఐ జిల్లాస్థాయి సుబ్రతో ముఖర్జీ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఐకమత్యంతో ఆడి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలువాలని ఆకాంక్షించా రు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆడే రామేశ్వర్ మాట్లాడుతూ.. అండర్-15 ఫైనల్లో జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్ జట్టు 3-2 గోల్స్ తేడాతో తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన జట్టుపై విజయం సాధించినట్లు వివరించారు. అండర్-17 ఫైనల్లో ఇచ్చోడ జెడ్పీఎస్ఎస్ జట్టుపై 1-2 గోల్స్ తేడాతో ఇచ్చోడ గిరిజన బాలుర గురుకుల పాఠశాల జట్టు విజయం సాధించిందని పేర్కొన్నారు. ఈ జట్లు ఈనెల 25, 26 తేదీల్లో సరూర్ నగర్ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సుబ్రతో ముఖర్జీ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీల కన్వీనర్ కోటోజీ చంద్రశేఖర్, డాక్టర్ ఎండీ ఖాసీం, బ్యాడ్మింటన్ కోచ్ కబీర్ దాస్, పీడీలు వినోద్‌రెడ్డి, పోచన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు..**
మండలంలోని చాందా (టీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 11వ జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల హెచ్ఎం పండరీనాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. మహేందర్ జోషి, అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ రాజేశ్, యూటీఎఫ్ సెక్రెటరీ లచ్చారాం, వెయిట్ లిటిల్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ వీజీఎస్ జ్యోతిష్యరన్, భాస్కర్, అఖిలేశ్, ప్రమోద్, సాయికిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన
# రైతులకు పరిహారం

**బేల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారం మంజూరు చేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెన్ గంగ పరీవాహక ప్రాంతాలైన మండలంలోని గూడ, మణియార్పూర్ రెవెన్యూ గ్రామాల శివారుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, సోయా, కంది తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలను త్వరలోనే వ్యవసాయాధికారులు పరిశీలిస్తారని, సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారని చెప్పారు. రైతులు అధైర్య పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల తెలిపారని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు గిమ్మ సంతోషావు, సామ రూపేశ్రెడ్డి, నాక్లే రాందాస్, గావుండే ఘణేశ్యాం, ఠాక్రే సాగర్, విపిన్, అవినాష్, సూర్యభాన్, కరీం తదితరులున్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి కోనేరు కోనప్ప!



**సిర్పూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కోనప్ప పోటీ చేసి పోడిపోయారు. కాగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అక్కడ పోటీ చేయడంతోనే ఓట్లు చీలాయని కోనప్ప అసంతృప్తి చేశారు. ఇక ఆర్ఎస్ ప్రవీణ్ కూడా బీఆర్‌ఎస్‌లో చేరడంతో కోనప్ప పార్టీకి గుడ్‌బై చెప్పి.. కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో తనకు తగిన గౌరవం దక్కడం లేదని ఇటీవల పార్టీ కార్యాకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు రాజకీయా వర్గాల్లో చర్చజరుగుతోంది.

# ట్రిపుల్ ఐటీలో ఎంటర్‌ప్రెన్యూర్స్ డే



**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ డేను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓఎస్డ్ ప్రొఫెసర్ మురళీదర్శన్ హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. పారిశ్రామికవేత్తలు సమాజానికి మార్గదర్శకులని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లి వాటిని ఆచరణలో పెట్టే ధైర్యం ప్రతీ విద్యార్థిలో ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయం అందించే ఇన్నోవేషన్ క్లబ్బు, ఇంక్యుబేషన్ సెంటర్లు, ప్రాజెక్టు వర్క్‌లో విద్యార్థులు తమ స్టార్టప్ ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు తమ స్టార్టప్ ఐడియాలను ప్రదర్శించి, సృజనాత్మక ఆలోచనలు, ప్రాజెక్టు రూపకల్పనలను వివరించారు. వివిధ విభాగాల విద్యార్థులు టీం వర్క్‌తో పనిచేసిన తీరు, భవిష్యత్ ఆలోచనలను ప్రాక్టికల్ మోడల్స్ మార్చే పట్టుదలను ప్రశంసించారు. ఆహార ప్రాసెసింగ్, ప్రపంచ వ్యాపారం, ఎగుమతులు, దిగుమతులు, ఆహార భ ద్రత వంటి సమకాలీన అంశాలపై విద్యార్థులకు వివరణాత్మకంగా తెలియజేశారు. విజయవంతమైన వ్యాపారులు కావాలంటే ఆవిష్కరణ దృక్పథం, పట్టుదల, క్రమశిక్షణ, సేవాభావం అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ చంద్రశేఖర్, మహేశ్, జి.నాగరాజు, విఠల్, కోఆర్డినేటర్లు ఆర్.సైదులు, పి.తేజస్విని పాల్గొన్నారు.



## ఉద్యోగులకు
# మెరుగైన వసతులు

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో రూ.1.10 లక్షలతో ఆధునీకరించిన ఐటీ విభాగాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు మారుతున్న కాలానికి అనుగుణంగా అనుకూల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆధునీకరించామని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీసైదా, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్రెడ్డి, ఏజీఎం భీభత్స, అధికారులు సాంబశివరావు, రాజన్న పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు
# దరఖాస్తుల ఆహ్వానం

**ఉట్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న హౌస్ వైరింగ్, సెల్ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, వీడియో గ్రాఫిక్స్, ఏసీ రిపేరింగ్, టూ వీలర్ మెకానిజం, సీసీ టీవీ ఇన్స్టాలేషన్, కుట్టు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, బస్సు చార్జీలు, ఒక జత యూనిఫాం, టూల్ కిట్స్, శిక్షణ అనంతరం కోర్సు ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన 18-45 ఏళ్లవారు అర్హులని పేర్కొన్నారు. ఆధారకార్డు, తెల్లరేషన్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ ప్రతులు, నాలుగు ఫొటోలతో ఈ నెల 27న కేబీలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9949412 159 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ‘పింఛన్లు పెంచుకుంటే ఊరుకోం’



## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

**సిర్పూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచకుంటే ఊరుకోమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. కౌటాలలో గురువారం ఏర్పాటు చేసిన మహాగర్జన స న్నాహక సదస్సులో మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రతిపక్ష పార్టీలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా పెన్షన్లు పెంచకుంటే హైదరాబాద్‌లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సభకు భారీ సంఖ్యలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు సత్యనారాయణ, థామస్, అనిల్, రాజేశ్, హీరమన్, శంకర్ పాల్గొన్నారు.



# మట్టి గణపయ్యనే పూజిద్దాం

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- మహాశ్రేష్ఠం మట్టి గణపతి
- మట్టి విగ్రహాలవైపే మొగ్గు..
- మట్టి గణనాథుడి ప్రతిమలే మేలంటున్న పర్యావరణ వేత్తలు
- తయారీతో ఉపాధి పొందుతున్న యువకులు
- వినాయక చవితికి ముస్తాబవుతున్న గణపయ్యలు
- ప్రజల అభిరుచికి తగ్గట్టు బొజ్జ గణపయ్యల తయారీ
- మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి



పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతి యేటా జరుపుకొంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గణనాథుడి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతారు. రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందని, దీంతో పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుంది. ఉమ్మడి జిల్లాలో చవితి సందడి నెలకొంది. 27 నుంచి ప్రారంభమయ్యే వినాయక నవరాత్రులను పురస్కరించుకొని వినాయక మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి. మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు, యువత నిమగ్నమయ్యారు. ప్రతిష్ఠకు గణనాథులను తరలిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలు, రంగులతో తయారు చేసిన ప్రతిమల కంటే మట్టి వినాయకులే శ్రేష్ఠమని వేద పండితులు, పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.





**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతియేటా జరుపుకొంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గణనాథుడి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతారు. రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందని, దీంతో పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుంది. తెలంగాణ సర్కార్ మట్టి వినాయకుల ను నెలకొల్పేలా ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రతి సంవత్సరం మట్టి వినాయకుడి నిమజ్జనం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరిస్తూ మున్సిపాలిటీల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటుంది. వినాయక చవితికి వారం రోజుల ముందు నుంచే వినాయక ప్రతిమలను బుక్ చేసుకుంటున్నారు. దీంతో పట్టణంలో వినాయక చవితి సందడి నెలకొంది.

**పెరిగిన మట్టి వినాయకుల గిరాకీ..**
రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాలతో భక్తులకు ఆకట్టుకునే విధంగా మట్టి గణపయ్యను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రతిమలు పర్యావరణ పరిరక్షణకు శ్రేయస్కరం అని అవగాహన కల్పిస్తుండడంతో మట్టి వినాయకులకు గిరాకీ పెరిగింది.

**రసాయనాలతో నీరు కాలుష్యం..**
రకరకాల రసాయనాలతో కూడిన రంగులు, ఇనుము, నీటిలో కరగని పదార్థాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలతో నీరు కలుషితం అవుతుందని, చెరువు మట్టి, బంక మట్టితో తయారు చేసిన వినాయకులతో నీరు శుద్ధికావడంతో పాటు నీటిలోని చేపలు, ఇతర ప్రాణులకు ఎలాంటి హాని ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకు వివిధ యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతి సంవత్సరం ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేయడంతో పాటు మట్టి వినాయకుల వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు.

**ప్లాస్టర్ ఆఫ్ పారిసతో ప్రమాదం..**
వినాయకులను తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. నిప్పుకూ దహనం కాదు. దీనిలో ముడిపదార్థం జిప్సం. చెరువుల్లో, ఇతర నీటి వనరుల్లో ఈ విగ్రహాలను వేస్తాం. వాటి తయారీలో వాడే హానికారక రసాయనాలతో డయేరియా, చర్మవ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తగరంతో చర్మ వ్యాధులు వస్తాయి. చర్మం రంగు మారుతుంది. స్కిన్ క్యాన్సర్‌కు ఆస్కారం ఉంది. ఆర్సానిక్ వల్ల తల వెంట్రుకలు ఊడతాయి. సీసం వల్ల కడుపునొప్పి వస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన వినా యక ప్రతిమలను నిమజ్జనం చేసిన నీటిని వినియోగిస్తే వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంది. రసాయనాల నీటిని పొలాలకు మళ్లిస్తే భూసారం తగ్గి భూమి సహజ స్వరూపాన్ని కోల్పోతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలతో అన్నీ ఇబ్బందులే!

**అన్నింటికీ మేలు..**
చవితి దగ్గరపడుతుండటతో విగ్రహాల కొనుగోళ్లు ఉపందుకున్నాయి. మట్టి ప్రతిమలతో ఎలాం టి హానీ ఉండదు. ఇందులో సందేహానికి ఆస్కారం లేదు. ఖర్చు తక్కువే అవు తుంది. నీటిలో నిమజ్జనం తరువాత ప్రతిమలు కరిగిపోతాయి. రసాయనాలతో చేసిన ప్రతి మలతో పోలిస్తే మట్టి ప్రతిమలను తక్కువే వాడుతున్నారు. ఎంత అవగాహన కల్పిస్తున్నా మట్టి ప్రతిమల మండపాలు ఐదు శాతానికి మించడం లేదు. మట్టి వినాయకులను బంకమట్టితో చేస్తారు. ఎలాంటి రంగులు పూయరు. దీంతో నీటి కాలుష్యం ఉండదు. మట్టి వినాయకులే అన్ని విధాలా శ్రేష్టం అని పర్యావరణవేత్తలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

**మట్టి మన ప్రాణం...**
మట్టి జీవాన్ని ఇస్తుంది. మట్టిలో అనేక జీవాలు ఉంటాయి. ఉదాహరణకు మట్టిలో విత్తనం నాటితే అది మహావృక్షంగా మారుతుంది. మట్టి జీవం పోస్తుంది. అదే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో విత్తనం నాటితే ఆ విత్తనం చనిపోతుంది. మొలకెత్తదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నిర్జీవంగా మార్చే ఒక విష పదార్థం. కాబట్టి మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని పూజిస్తే జీవం గల దేవుడి ప్రతిమను పూజించినట్లే.మనిషి జీవితం డబ్బు, ఆర్భాటాలతో ముడిపడి లేదు. మనిషి జీవితం గాలి, నీటి తోనే ముడిపడి ఉన్నది. కాబట్టి గాలిని, నీటిని, మట్టిని కాపాడుకుందాం.

## ఫుట్‌బాల్ పోటీల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ

**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సుబ్రతో ముఖర్జీ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం(సీఓఈ) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గురువారం విద్యాలయంలో డీఈవో యాదయ్య, ఎస్ఓఎఫ్ జిల్లా కార్యదర్శి యాకుబ్ ఆధ్వర్యంలో అండర్-15, 17 విభాగం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. సీఓఈ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. విజేత జట్లు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ తెలిపారు. అండర్-15 విభాగం పోటీల్లో మంచిర్యాల ట్రినిటి విద్యార్థులు, అండర్-17 విభాగంలో కోటపల్లి గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్లు పీడీలు రవి, చాంద్పాషా, నిర్వాహకులు అల్లూరి వామన్, రాజశేఖర్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పుస్తక రచయిత శిక్షణకు గిరిజన యువతి



**నార్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
గాదిగూడ మండల కేంద్రానికి చెందిన ఆదివాసీ గిరిజన యువతి పెందూర్ దీపాలక్ష్మి ఆదివాసీ చరిత్రపై జాతీయస్థాయి పుస్తక రచయిత శిక్షణకు ఎంపిక య్యారు. ఈ నెల 19 నుంచి 25 వరకు బెంగళూరులో నిర్వహించనున్న శిక్షణలో ఆమె పాల్గొంటున్నారు. గ్రామీణ పేదరిక నిర్మాణ సంఘం, గ్రామీ ణాభివృద్ధి శాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీ దివ్య ఆదేశాల మేరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీరాజ్(ఎన్ఐఆర్డీపీఆర్) ఆధ్వర్యంలో ఆదివాసీ చరిత్రపై ఆరు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గాదిగూడ మండలం నుంచి అర్హత, అనుభవం, నాయకత్వ లక్షణాలు కలిగిన పెందూర్ దీపాలక్ష్మిని డీఆర్డీవో ఎంపిక చేశారు. దీపాలక్ష్మి మాట్లాడుతూ కష్టపడితే ఏదైనా సాధ్య మవుతుందని చెప్పారు. జాతీయస్థాయి పుస్తకాల రచయిత శిక్షణకు ఎంపిక సంతోషంగా ఉందన్నారు.

## ఆదివాసీల నోవొంగ్ పూజలు

**బజార్‌హత్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని  చింతలస్వాంగి గ్రామ శివారులో గురు వారం సిడాం పరివారం ఆధ్వర్యంలో నోవోంగ్ ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మా సంలో గోండు గూడాలలో నోవొంగ్ పూజలు చేస్తారు.





## ప్రాణం తీసిన పబ్జీ

### పబ్జీ ఆడొద్దని మందలించిన తండ్రి..

### మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ఫోన్‌లో పబ్జీ గేమ్‌కు బానిసగా మారిన విద్యార్థి ప్రాణం తీసుకున్న ఘటన బుధవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆనందనగర్ కాలనీలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని మౌళాలి ప్రాంతానికి చెందిన బేతి సంతోష్, సాయిప్రజ దంపతులు గత కొంత కాలంగా భైంసాలోని ఆనంద నగర్ కాలనీ నివాసముంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బేతి రిశేంద్ర హైదరాబాద్‌లోని భాష్యం స్కూల్లో తొమ్మిదో తరగతి పూర్తి చేసుకొని, పదో తరగతిలో చేరాల్సి వుండగా, కొంత కాలంగా పబ్జీ గేమ్‌కు బానిస అయ్యాడు. పదవ తరగతి కోసం పాఠశాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయాడు. మార్కు తెచ్చి చదువుపై దృష్టి పెట్టే చివరి ప్రయత్నంగా గత రెండు మూడు రోజుల నుంచి కుమారుడికి కుటుంబీకులు పబ్జీ గేమ్ ఆడకుండా కట్టడి చేసినట్లుగా తెలిసింది. దీంతో డిప్రెషన్‌కు లోనై విద్యార్థి సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భైంసా పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏరియా ఆస్పత్రిలో పోస్ట్ మార్టం కోసం బాడీని తీసుకువచ్చారు.

## క్రెడిట్ కార్డుతో రూ.50వేలు మోసం

**దండేపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి క్రెడిట్ కార్డుతో రూ.50వేలు మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దండేపల్లికి చెందిన వ్యక్తికి తాను లావాదేవీలు నిర్వహించే బ్యాంకు పేరుతో క్రెడిట్ కార్డు అవకాశం కల్పిస్తూ ఫోన్ చేశారు. ఓటీపీలు చెప్పాలని కోరడంతో చెప్పాడు. ఆ తర్వాత రెండు రోజులకు ఇంటికే క్రెడిట్ కార్డు వచ్చింది. మళ్లీ ఫోన్ చేసి కార్డుపై ఉన్న నంబరు చెబితే ఆక్టివేట్ అవుతుందని చెప్పడంతో అలాగే చేశాడు. ఆదివారం మళ్లీ ఓసారి ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు చెప్పాలని కోరడంతో చెప్పాడు. దీంతో రూ.33వేలు ఒకసారి, మరోసారి రూ.16వేలు కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. ఇటీవల కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి వద్ద క్రెడిట్ కార్డు చెక్ చేయగా.. అందులో నుంచి రూ.50వేలు కట్ అయినట్లు తెలిసింది. దీంతో సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
పట్టణంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముకేష్ నాయక్ (30) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని శివకేశవ మందిర్ కాలనీలో గత కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. గురువారం వేకువజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముకేష్ మృతి కారణాలు తెలియాల్సి ఉంది.



# చెల్లిని కిడ్నాప్ చేసిన అక్క : ఆరుగురిపై కేసు నమోదు



**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
చెల్లి ప్రేమ వివాహం చేసుకోవడాన్ని ఓర్వలేక ఓ అక్క ఆమెను కిడ్నాప్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. చెల్లె భగత్ మనీషా ప్రేమ వివాహం చేసుకోగా, తనకు పెళ్లి కాలేదని తలమడుగుకు చెందిన విజయ ఆమెపైన కక్ష పెంచుకుంది. ఆమె భర్త నుంచి విడదీసేందుకు పన్నాగం పన్నింది. ఆమెను మహారాష్ట్రలోని కిన్వట్‌లో బంధించింది. బాధితురాలి భర్త అలుగంటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ నకు సహకరించిన తలమడుగుకు చెందిన భగత్ విజయ, భగత్ సునంద, భగత్ ప్రగతి, తాంసికి చెందిన షబ్బీర్, ఓ మైనర్ బాలుడితో పాటు కిన్వట్కు చెందిన ప్రతీన్పై కేసు నమోదు చేశారు. కిడ్నాప్కు గురైన బాధితురాలి ఆచూకీ తెలుసుకుని ఆమెను కిన్వట్ నుంచి తీసుకువచ్చారు. కాగా, మనీషా ఇటీవల భగత్ శ్రీనివాస్తో ప్రేమ వివాహం చేసుకుని ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్ నగర్లో నివాసముంటోంది. ఈ పెళ్లి ఇష్టం లేకనే ఆమె అక్క కిడ్నాప్ నకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో పోలీసులపై దుష్ప్రచారం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ వ్యవస్థ మహిళలపై గౌరవంగా వ్యవహరిస్తుందని తెలిపారు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ ఉన్నారు.

## ఢిల్లీలో తడోరా ఎయిర్ ఫోర్స్ జవాన్ మృతి

### ముథోల్ మండలం తరోడా గ్రామంలో విషాద ఛాయలు



**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని తరోడా గ్రామానికి చెందిన లక్ష్మి ఈశ్వర ప్రసాద్ 25 అనే యువకుడు వైమానిక జవాన్‌గా పనిచేస్తూ మృతి చెందారు. మృతుడు గ్వాలియర్ ప్రాంతంలో వైమానిక దళంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. బుధవారం సహోద్యోగులతో కలిసి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే ఆగ్రాలోని దమ్మోహ వాటర్ ఫాల్‌కు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఈశ్వర్ ప్రసాద్ జలపాతంలో గల్లంతయ్యాడు. దీంతో తోటి ఉద్యోగులు ఆగ్రాలోని వైమానిక ఆఫీస్‌కు సమాచారం ఇచ్చారు. వారు స్థానిక పోలీస్‌లతో వాటర్ ఫాల్‌లో గాలించగా ఈశ్వర్ ప్రసాద్ మృతదేహం లభ్యం అయినట్టు తెలిసింది. అక్కడి వైమానిక అధికారులు కుటుంబ సభ్యులకు గురువారం రాత్రి సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక సర్పంచ్‌తో కలిసి ఎమ్మెల్యే రామారావు పటేల్ వద్దకు వెళ్లారు. ముథోల్ ఎమ్మెల్యే వెంటనే ఆదిలాబాద్ ఎంపి నగేష్ తోపాటు కేంద్ర హోం సహాయమంత్రితో ఫోన్‌లో మాట్లాడి పార్థవ దేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. జవాన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## నిశి రాత్రి వేళ విషాదం

### పాముకాటుతో బాలుడి మృతి

**బెజ్జూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**



పెంచికల్‌పేట మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన కొడప నవదీప్(11) అనే బాలుడు పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నేలపై నిద్రించాడు. సుమారు 9గంటల ప్రాంతంలో కట్లపాము నవదీప్ చేతిపై మూడుసార్లు కాటువేసింది. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు లైటు వేశారు. పక్కనే ఉన్న కట్లపామును గమనించి కొట్టి చంపారు. బాలుడిని చికిత్స కోసం కాగజ్నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. సిర్పూర్(టి)లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న నవదీప్ ఇటీవలే ఇంటికి వచ్చాడు. పాముకాటుతో కన్న కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు సులోచన, జగదీష్ రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబానికి పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు.

### రైలు కింద పడి గుర్తు

## తెలియని వ్యక్తి ఆత్మహత్య

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల-పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఒంటిపై బ్లూ కలర్ నెక్ టీషర్ట్, టీ షర్టు అర్‌ఎస్పీ అని, నాబలగం మాగళం అని తెలుగులో రాసి ఉన్నట్లు తెలిపారు. నలుపు రంగు ఫార్మల్ పాయింట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని, వివరాలకు జీఆర్పీ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో మృతదేహం లభ్యం

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక మృతదేహాన్ని ఆదిలాబాద్ 2-టౌన్ పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద లభ్యం అయిన ఆధార్ కార్డు ఆధారంగా ఆంధ్రప్రదేశ్లోని కృష్ణ జిల్లా ఉయ్యూర్‌కు చెందిన రోజారియో క్రిస్టోఫర్ (55)గా గుర్తించారు. ఎస్సై విష్ణు ప్రకాష్ మృత దేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి ఏపీలోని సంబంధిత పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు. మృతుడు ఎలా చనిపోయాడు అన్న వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కుటుంబ సభ్యులు వచ్చాక పంచనామా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**సిరికొండ, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతు మోరె తానాజీ ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తానాజీ ఎద్ల పొలాల పండుగ సందర్భంగా తన ఎద్దులను శుభ్రం చేసేందుకు గ్రామ సమీపంలోని చిక్మన్వాగులోకి దించాడు. ఇటీవల కురిసిన వర్షాలకు సమీపంలోని విద్యుత్ స్తంభం నేలకొరిగి తీగలు వాగులో పడ్డాయి. గమనించని అధికారులు విద్యుత్ నిలిపివేయలేదు. తానాజీ తన ఎద్దును వాగులోకి దించగా షాక్‌తో మృతి చెందింది. అదృష్టవశాత్తు ఎవరూ అందులోకి దిగకపోవడంతోప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకుని వెంటనే అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



### తాటిచెట్టుపై నుంచి పడి

## కార్మికుడికి తీవ్ర గాయాలు

**తాండూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని మాదారం-3 ఇంక్లైన్ గ్రామానికి చెందిన రంగు లక్ష్మీనారాయణ గౌడ్ తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం గ్రామ సమీపంలోని తాటిచెట్టుపైకి ఎక్కి కల్లు తీస్తుండగా అదుపుతప్పి జారి కిందపడ్డాడు. తీవ్ర గాయం కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## 3న జాతీయ లోక్ అదాలత్

**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ఎంవీ రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో గురువారం సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జి ఉల్లం అజయ్, జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ అమృత్ పాల్ కౌర్, ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరి ష్కరించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో రాజీ చేయడానికి అనుకూలంగా ఉన్న కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## గంజాయి విక్రేతల అరెస్టు

**ఆదిలాబాద్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఇన్స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. ఎస్ఐ విష్ణుప్రకాష్, హెచ్సీ వినాయక్, కానిస్టేబుళ్లు సుధాకర్ రెడ్డి, క్రాంతి, నరేందర్, గోపాల్ గురువారం రైల్వేస్టేషన్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న సందర్భంగా మహాలక్ష్మీవాడకు చెందిన షేక్ మసూద్, మహారాష్ట్ర బ్రోకర్ చిక్మల్వాడికి చెందిన జుబేర్ ఫారూఖ్ పఠాన్ అలియాస్ సల్మాన్ అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిని తనిఖీ చేయగా రూ.6,075ల విలువైన 243 గ్రా. ఎండు గంజాయి లభించిందన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టణంలో ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు హెచ్చరించారు.



## బీఆర్ఎస్‌లో పలువురు బీజేపీ నాయకుల చేరిక

**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు(బీజేపీ)పై అసంతృప్తితో ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొంగ సత్యనారాయణతో పాటు, పలువురు నాయకులు పార్టీ గులాబీ కండువా కప్పుకున్న వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే హరీష్ బాబు వైఖరి వల్లే బీజేపీని వీడినట్లు వారు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకు కృషి చేస్తామని అన్నారు.

## జలాభిషేకానికి తరలిన భీమన్న గజాలు

**మామడ, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని నల్దుర్తి గ్రామంలోని భీమన్న దేవాలయంలోని గజాలను గురువారం గంగ స్నానా నికి తరలించారు. ఈ సందర్భంగా గజాలను గ్రామంలో ఇంటింటికి ఊరేగింపుగా తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో గజాలకు జలాభిషేకం నిర్వహించి కొండపై ప్రతిష్టించనున్నారు. శుక్రవారం దట్టమైన అటవీ ప్రాంతంలోని భీమన్న దేవాలయంలో జాతర నిర్వహిస్తు న్నట్లు ఆలయ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో విడిసి,ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## కుభీర్ సంతలో ఎడ్ల పొలాల సందడి

**కుభీర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వార సంతలో ఎటుచూసిన ఎడ్ల పొలాలు సందడి నెలకొంది. పొలాల పండగ రోజు ఎద్దులకు (బసవన్నలకు) అలంకరించడానికి అవసరమైన అనేక రకాల వస్తువులు, మట్టితో తయారు చేసిన ఎద్దులు, ఆవు దూడల విగ్రహాలు విక్రయానికి వారసంతకు తరలివచ్చినాయి. పూజా సామాన్లతో కలకలలాడాయి. రైతులకు, గిరిజనులకు ఆరాధ్య పండగ కావడంతో సందడిగా కనిపించింది. కిరాణా షాపుల్లో కొబ్బరికాయల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతివారం జరిగే సంతకంటే ఈ రోజు సంతలో భిన్నంగా పండగ కు సంబంధించిన వస్తువులు విక్రయానికి తరలివచ్చాయి.

## కొండబాబుకు రాష్ట్రస్థాయి సేవారత్న అవార్డు

**బెల్లంపల్లి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సంఘ సేవకుడు కుడిపూడి కొండబాబు సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. కుడిపూడి కొండబాబు గత 15 సంవత్సరాల నుంచి కోల్‌బెల్ట్ ప్రాంతంలో నిస్వార్థంగా సేవలు చేస్తున్నారు. నేతాజి సుభాష్ చంద్రబోస్ సేవాసమితి" అనే స్వచ్ఛంద సంస్థని ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవలందిస్తున్నారు. ఆయన సంఘ సేవలను గుర్తించిన మధర్ ఫౌండేషన్ మోగాసిటి నవకణవేదిక అనే స్వచ్ఛంద సంస్థ, 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి సేవా రత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 25న రవీంద్రభారతిలో అవార్డును అందుకోనున్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



**మందమర్రి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో విజయవంతంగా నిర్వహించాలని బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పండుగలు మన సంస్కృతికి, ఐక్యతకు ప్రతీకలని, వాటిని సహోదర భావంతో జరుపుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గణేష్ నవ రాత్రులలో డీజే సిస్టమ్‌లకు ఎలాంటి అనుమతి లేదని ఆయన పునరుద్ఘాటించారు. సోషల్ మీడియాలో వ్యాపించే అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే అభ్యంతరకర పోస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటివి దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. అనంతరం మందమర్రి సిఐ కె శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, విగ్రహాల నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ మత పెద్దలు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, శాంతియుత వాతావరణాన్ని కాపాడటానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, అదనపు ఎస్ఐ నూనె శ్రీనివాస్, మత పెద్దలు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి




### కళాశాలలు, మెడికల్ షాపుల పరిసరాల్లో ప్రత్యేక నిఘా
### కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు జిల్లాలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ లో ఎస్.పి. కాంతిలాల్ సుభాష్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పి చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి మాదకద్రవ్యాల నివారణపై నషా ముక్తి భారత్ అభియాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొమురం భీమ్ ఆసిఫాబాద్‌ను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ముఖ్యంగా మారుమూ ల గ్రామాలు, గుట్టలు, అటవీ ప్రాంతాలలో గంజాయి సాగు చేస్తున్నారని, నివారించేందుకు అధికారులు తనిఖీలు నిర్వహించి సంబంధిత భూ యజమానులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నుండి వస్తున్న రాయితీలను రద్దు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట చేనులలోకి వెళ్లి తనిఖీలు నిర్వహించి గంజాయి సాగుకు పాల్పడుతున్నట్లయితే పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆటో, లారీడ్రైవర్లపై నిఘా ఉంచాలని, గంజాయి రవాణా జరగకుండా విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహిం చాలని తెలిపారు. విద్యాలయాలకు 200 మీటర్ల పరిధిలో ఎలాంటి పాన్ టేలాలు ఉండకూడదని, పొగాకు పదార్థాలు విక్రయాలు జర గకుండా చర్యలు తీసుకోవాలని, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, మెడికల్ షాపులలో మత్తు పదార్థాలను విక్రయించకుండా తనిఖీలు నిర్వ హించాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో గంజా యి రవాణా జరుగకుండా ఆర్ టి సి, రైల్వే పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు, ప్రజలకు గంజాయి సేవించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలపై కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి మాదకద్రవ్యాల రవా ణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మాదక ద్రవ్యాలకు బానిస అయినవారికి చికిత్స కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి నెల చివరి బుధవారం రోజున జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సమావేశం ఉంటుందని, జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం జరగకుండా అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా మద్య నిషేధశాఖ అధికారి జ్యోతి కిరణ్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా రవాణా అధికారి రామ్ చందర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

### డీఎంహెచ్ డాక్టర్ నరేందర్ రాథోడ్

**బోథ్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గంలోని సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆదిలాబాద్ డిఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేయడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రిలో ఓపి విభాగంలో ఎక్కువగా కేసులు నమోదవుతున్న గుట్ట పక్క తండా,గుర్రాల తండా గ్రామాలలో శానిటేషన్‌ను పరిశీలించి ఫీల్డ్ సిబ్బందికి సూచనలు చేశారు. సోనాల మండల కేంద్రంలోని ఆర్ఎంపీ కేంద్రాలను పరిశీలించి సూచనలు ఇస్తూ ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని అర్హతకు మించి వైద్యం చేయ రాదని సూచించారు. సోనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి, సూపర్ వైజర్ కవిత, లింగారెడ్డి పాల్గొన్నారు.

## నేడు భైంసాకు మందకృష్ణ

**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం పెన్షన్ల అమలు, స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ల సమస్య సాధనకై శుక్రవారం ఏర్పాటు చేస్తున్న వికలాంగుల చేయూత పెన్షన్ దారుల మహా గర్జన, చలో భైంసా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, వీహెచ్పిఎస్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ బంక్విట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మా ట్లాడారు...ఈ కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతున్న పెన్షన్ల విషయంలో అంటి పట్టనట్లు ఉందని అన్నారు. పట్టణంలోని సురలోక్ గార్డెన్లో ఏర్పాటు చేయనున్న వికలాంగుల చేయూత పెన్షన్ దారులు మహా గర్జనకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు అంబేద్కర్ సాయిచంద్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు నందకుమార్, రాష్ట్ర నాయకులు గంగాధర్, జిల్లా నాయకులు దిగంబర్, శంకర్, ఆనంద్, మహేందర్, వినేష్, రాజ్‌కుమార్, మహేశ్వర్, మోహన్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.




## కాగజ్‌నగర్‌లో నకిలీ నోట్ల కలకలం

**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో నకిలీ కరెన్సీ చలామణి అవుతుంది. పలువురు దళారులు వ్యూహాత్మకంగా నకిలీ నోట్లను చలామణి చేస్తున్నట్లు తెలుస్తుంది. వీటి వల ఓ వ్యాపారి స్థానిక ఓ బ్యాంకులో నగదు జమ చేసేందుకు డబ్బులను బ్యాంకుకు తీసుకెళ్లారు. రూ.500 నోట్ల కట్టలలో ఒకటి నకిలీ వచ్చింది. బ్యాంక్ అధికారులు అ నకిలీ నోట్లో గుర్తించి సదురు వ్యాపారికి అందజేశారు.

## బ్లడ్ బ్యాంకులో తనిఖీ



**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
అత్యవసర వైద్యం, శస్త్ర చికిత్సలు చేసేందుకు రక్త నిధి కేంద్రంలో రక్త నిల్వలను అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుప త్రిలో బ్లడ్ బ్యాంక్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రక్త నిధి కేంద్రంలో రిజిస్టర్ లను పరిశీలించారు. వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి వివరాలు సేకరించారు. ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు సత్యవసర సేవలకు తగిన రక్తాన్ని అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్ రెడ్డి, చైర్మన్ మహేందర్, సెక్రెటరీ మధు సూదన్, మాధవి లత, బుక్క వెంకటేశ్వర్, జిల్లా మాస్ మీడియా అధికారి వున్నారు.

## విచారణ చేయకుంటే నిరాహార దీక్ష చేస్తాం

**వాంకిడి, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**
మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక జరిగిన అవకతవకల విచారణ జరిపి చర్యలు తీసుకో వాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు అర్హులైన లబ్ది దారులను పక్కనా పెట్టి. అనార్హులై కాంగ్రెస్ నాయకులకే ఇండ్లను మంజూరు చేశారని వారి పేర్లను తొలగించాలన్నారు.

# రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించండి





- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినతి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక అనుమతి ఇవ్వండి మంత్రిని వివేక్‌ను కోరిన ఎమ్మెల్యే

**ఖానాపూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ నియోజకవర్గంలోని రోడ్ల విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కలిసి కోరారు. నియోజకవర్గంలోని నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుండి బెల్లాల్ రోడ్డు, ఖానాపూర్ నుండి తర్లపాడు వరకు రోడ్డు విస్తరణకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే మంత్రిని కలిసి కోరారు. ఖానాపూర్, కడం మండలం లోని బెల్లాల్, లింగాపూర్, మద్దియపడగ, తర్లపాడు గ్రామస్తులు బెల్లాల్ నుండి ఖానాపూర్ వరకు 24.60 కి.మీ మరియు ఖానాపూర్ నుండి తర్లపాడు వరకు 2.80 కి.మీ రోడ్లు చాలా రద్దీగా ఉంటుందని మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ రోడ్లలో అనునిత్యం అధిక వాహనాలతో పాటు ప్రజలతో రద్దీగా ఉంటుందని తెలిపారు. ఈ రోడ్ల గుండా ప్రజలు కాలినడ కన వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్లను విస్తరించాలని గ్రామస్తులు పలుమార్లు విన్నవి స్తున్నారని ఎమ్మెల్యే తెలుపరు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరియు నియోజకవర్గం అభివృద్ధి అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక అనుమతి ఇవ్వండి మంత్రి వివేక్ కోరిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు మండలానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక అనుమతి ఇప్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట్ స్వామిని గురువారం కోరారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక లభించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో నిర్మాణాలు ఆగిపోయాయని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. రాష్ట్ర మంత్రి ఇసుక సరఫరాలో లబ్ధి చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.




# క్షీణిస్తున్న 'పాల్వాయి' ఆరోగ్యం

## నేడు పట్టణ బంద్‌కు బీజేపీ నాయకుల పిలుపు

**కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్యే పాల్వాయి హరీశా బాబు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. రాత్రి ప్రభు త్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీధర్ బాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు నిర్వహించి షుగర్ లెవల్స్ తగ్గుతున్నాయని తెలిపారు. దీక్ష ఇలాగే కొనసాగితే ఎమ్మెల్యే ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం కాగజ్నగర్ పట్టణ బంద్కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తీవ్ర అస్వస్థతకు గురైతే జరిగే పరిణామాలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో ఈర్ల విశ్వేశ్వ రావు, శ్రీని వాస్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న ఎమ్మెల్యే నిరాహార దీక్ష**

ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 49 రద్దుచేసి, పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష కొనసాగుతుంది. గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి సందర్శించి, ఎమ్మెల్యే దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కరించడం ప్రభు త్వం విఫలమైందన్నారు. మద్దతు తెలిపి పరామర్శించిన వారిలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఎమ్మాజి, ముకేష్ గౌడ్, పులగం తిరుపతి, ఆంజనేయులు, గోవర్ధన్, సంతోష్, శ్రీనివాస్, కార్యకర్తలు ఉన్నారు.




# మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐలో కుంభకోణం

- బ్రాంచి 2-లో వెలుగులోకి వచ్చిన ఘటన
- రూ.80 లక్షల నగదు, రూ.5 కోట్ల వరకు బంగారం మాయం
- గుర్తించిన బ్యాంకు సబ్బంది.. పోలీసులకు ఫిర్యాదు
- పరారీలో బ్యాంకు క్యాషియర్
- నిందితులను త్వరలోనే పట్టుకుంటాం
- బ్యాంకును పరిశీలించిన రామగుండం సీపీ

**చెన్నూర్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్-2లో పెద్ద ఎత్తున నగదు, బంగారం మాయమైంది. ఈ విషయాన్ని బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో గురువారం పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ నిమిత్తం బ్యాంకును అధీనంలోకి తీసుకున్నారు. బ్యాంకులో రూ.80 లక్షలతో పాటు రెండు నుంచి మూడు కోట్ల రూపాయల



విలువైన బంగారం మిస్ అయినట్లు బ్యాంకు మేనేజర్ ఆడిట్‌లో గుర్తించారు. దీంతో, బ్యాంకులో తమ అవసరాల నిమిత్తం బంగారం కుదువ పెట్టి లోన్ తీసుకున్నవారు, బంగారాన్ని బ్యాంకులో ఉంచిన వారు సైతం ఆందోళన చెందారు. తమను బ్యాం కు లోపలికి అనుమతించకపోవడంతో ఖాతాదారులు ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. బ్యాంకు అవకతవకలపై బ్యాంకు క్యాషియర్ రవీందర్ ను ప్రధాన అనుమానితుడిగా అనుమానిస్తున్నారు. సంఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత నుంచే అతను కనిపించకుండా పోయాడని పోలీసులు ధృవీకరించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్‌జా చెన్నూరు ఎస్‌బీఐ బ్రాంచి 2ని సంద ర్శించి పరిస్థితిని సమీక్షించారు. బ్యాంకు లోపల ప్రతి విభాగాన్ని తనిఖీ చేసి సిబ్బందిని విడివిడిగా ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో సీపీ మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఎంత మేర అవకతవకలు జరిగాయో విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని సీపీ తెలిపారు.



# నిర్మల్ జిల్లాకు 13 పూర్వ ప్రాథమిక పాఠశాలలు

**ముథోల్, ఆగస్టు 21 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో నూతనంగా 13 పూర్వ ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుండే స్థానిక ప్రాథమిక పాఠశాలలలో ఇవి ప్రారంభం కానున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని కోసం 13 మంది మహిళా బోధకులు, 13 మంది మహిళా ఆయాలను నియమించేందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అనుమతించారు. ఇందుకు స్థానికులైన మహిళా అభ్యర్థుల నుండి ఈ 25 వరకు విద్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, తత్సమానం పూర్తి చేసిన వారు ఉపాధ్యాయ పోస్టులకు ఎలిజిబుల్ కాగా, ప్రాథమిక విద్యలో కోర్స్ చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణత కలిగిన మహిళ అభ్యర్థులు ఆయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని, నో టిఫికేషన్ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాలు అర్హులని(ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యూఎస్ )కి 5 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగులకు మరో 3 సంవత్స రాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉందని పేర్కొన్నారు. జిల్లాలో కడెం (పాండ్వాపూర్,కుభీర్(బా కోట్), కుంటాల (లింబ (కె), నర్సాపూర్ (జి), నిర్మల్ అర్బన్ (నాయుడివాడ), నిర్మల్ రూరల్ (ముజ్గీ), సారంగాపూర్(సిరిపెల్లి తండా), తానూర్ (మసల్గా) (బొంద్రెడ్), భైంసా (పెండ్పల్లి), లక్ష్మణ్‌చందా (చామన్‌పల్లి చోటపోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY